



మహిమ
# శబ్దం
...శబ్దము వచ్చిన తరువాత
యేసు మాత్రమే అగపడెను
- లూకా 9:36
ఆధ్యాత్మిక వారపత్రిక
RNI No. APTEL/2007/20130
Postal Regd. No. H/RMY/61/2023-25
Despatch Head Post Office, RJY
Post Box No.3, SriRamNagar Post, RJY-5
www.mahimasabdam.com
mahimasabdam.tv@gmail.com

సంపుటి : 20 సంచిక : 06 ఎడిటర్ : జి.ఎన్.రావు, 9390209376 శుక్రవారం, ఏప్రియల్ 26 - మే 2, 2024 వెల : నెలలో పక్షమునకు రూ. 25/- పేజీలు : 12

# యుగాల ఆశ



వాళ్లెందుకంత గొప్ప వాళ్లయ్యారు? ఆనాటి వాళ్లు కూడా మనవంటి మనుష్యులే కదా? వాళ్లెందుకంత ఫలవంతమైన ఆత్మీయ జీవితాన్ని పొందారు. నేడు మనమెందుకు ఇంత పేలవమైన ఆత్మీయ జీవితాన్ని గడుపుతున్నాం? ఉద్రేకపూరితమైన భక్తిని గురించి నేను మాట్లాడటం లేదు.

మన అంతరంగాల్లో శక్తివంతమైన భక్తిని, పరిశుద్ధతలో తీవ్రతను యదార్ధత విషయంలో రోషాన్ని దేవుని యెడల ప్రేమ నమ్మకత్వాలను అంతగా ఎందుకు కలిగి ఉండలేకపోతున్నాం? ఆలోచనలు చుట్టుముట్టేస్తుంటే, ఎదో తెలియని బాధ అంతరంగాన్ని నింపేస్తుంది. అయ్యో నేనెందుకు ఇంత “చప్పగా” మారిపోయాను. ఇక ఇంతేనా? అని వాపోతూ ఏం చేయ్యాలి? అనే తీవ్రమైన ప్రశ్న వద్ద కొందరు, ఉద్రేకాన్ని ఆశ్రయించి, శరీరానుసారంగా మారిపోతూ. తాము మంచిభక్తి చేస్తున్నామని మనతోనే అంటుంటే మనం గుడ్లప్పగించి చూస్తుండి పోవటం మినహా ఏం చెయ్యలేం. అవునా?

శేషంలో భాగమైన వాళ్లెవరైనా తటస్థపడితే వీళ్లతో మనకు ఎల్లప్పుడూ సహవాసం ఉంటే ఎంత బాగుండును. అనుకుంటాం వాళ్ల పరిశుద్ధ జీవితం వారి ఆత్మీయ పటిష్టత మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది. హమ్మయ్యా ఒక్కరి నైనా చూడగలిగాం... అనుకుంటుండగా మన అంతరంగంలో మనమెందుకు ఉండలేకపోతున్నాం? నీటి వాలుకు కొట్టుకుని పోతున్న చేప, గాలికి కొట్టుకుపోతున్న ఎండుటాకు, కురుస్తున్న వానలో కరిగి రూపం కోల్పోతున్న మట్టిపెళ మనం ఒకే మాదిరిగా కనిపిస్తాం. మనపై మనకే తెలియని అసహ్యం ఏర్పడుతుంది కాదని అనలేం.

నిజానికి కాలంలో వాళ్లెందుకలా నిలచి ఉండగలిగారు? తుఫానుల నడుమ పరీక్ష, శోధనల మధ్య చెక్కు చెదరని శిఖరంలా ఎలా ఉండగలిగారు? నేడైనా పలిశీలన చేద్దాం. కారణం కొంచెమైనా అర్ధమైతే జవాబు మసకగానైనా కనిపిస్తుంది. మనలోపం అర్ధమౌతుంది. కర్తవ్యం కొంతవరకైనా బోధపడుతుంది. అంతుచేత మనం కలసి పరిశీలన చేద్దాం.

లేఖనాలు మన ముందున్నాయి. చరిత్ర పుటలు అందుబాటులోనే ఉన్నాయి. రండి కలసి ధ్యానిద్దాం. అర్థం అయ్యేట్లు చెయ్యమని ప్రభువుని ప్రార్ధిద్దాం. ప్రియ తండ్రీ మాకు నీవు కోరిన అంతస్థులో జీవించాలనే ఆశ. నీ లేఖన ప్రమాణాలలో నిలవాలనే వాంఛ. అయినా ఎక్కడ తప్పిపోతున్నామో అర్ధం కావటం లేదు. మాకు బోధించటానికి నీవే మాకు బోధకులను కనపర్చు. లేఖనాలను గ్రహించే మనస్సును దయచెయ్యి. మా కనులు తెరువు లేఖనాల్లో మాకు మీరు తెలియజేసిన దానిని అనుసరించి జీవించే ఆత్మబలం కావాలి. వేం ఎంత బలహీనులమో మాకు అర్ధమైంది. పరిష్కారం తెలియపర్చు. గర్విష్టులం కాకుండా విధేయులం అయ్యేందుకు మా గతం, మా చేతగాని తనం మాకు ఉపయోగపడేలా చేసింది నీవే. మేం నీకు ఉపయోగపడేట్లు మమ్మల్ని తయారు చెయ్యి నీ నడిపింపునకు, నీ సంపూర్ణ చిత్తానికి మమ్మల్ని అప్పగించుకుంటున్నాం చాలినంత సహాయం నీవే. మా లోపం పూర్తిగా తెలిసిన వైద్యుడవు మాకేం కావాలో నీకే బాగా తెలుసు. మాకు కావలసింది దయచేసి అనుగ్రహించు. నీ నామమైన యేసు నామంలో ప్రార్ధిస్తున్నాం. తండ్రీ ఆమేన్.

**1. అబ్రాహాము - ఆశగల ప్రాణాన్ని తృప్తి పర్చే దేవుడు :**

మనలను, మన ఆశను తెలిసిన ఆయనే యోహాను 8:56లో మీ తండ్రియైన అబ్రాహాము నాదినము చూడవలెనని మిగుల ఆనందించెను. దానిని చూచి సంతోషించెను అన్నారు. ఈ లేఖనం ఎన్నో వేల సంవత్సరాల క్రిందటి సంఘటన, ఆయన దానిని గుర్తుచేస్తుంటే ఆనాటి ఆ భక్తుని జీవితం ఆయనను ఎంత సంతోషింప చేసిందో ఒక వ్యక్తి జీవితంలో ఏది పరలోకాన్ని సంతోషపర్చుతుందో నాకు అర్ధమౌతున్నట్టు అనిపించింది. ఆనందం, సంతోషం దేనిలో ఉన్నట్లు అబ్రాహాము గ్రహించాడో చూడండి.

1. నాదినము చూడవలెనని మిగుల ఆనందించెను.
2. చూచి సంతోషించెను.

**1. నాదినము చూడవలెనని మిగుల ఆనందించెను :**

ప్రభువు భూమి మీదకి మానవునిగా రక్తమాంసాలలో పాలివాడు కావటమా? దేవుడు తానే మానవునిగా రావటమా? ఎప్పుడు!! (అదే ఆతని ఆనందం యొక్క రహస్యం) నేను అది చూడాలి. అదే నా జీవితాశయం, అదే నా గురి. దేవా ఎప్పుడు భూమిపైకి మానవునిగా వస్తావు? అబ్రాహాం ఆలోచన యావత్తు అక్కడే కేంద్రీకరించబడింది. ఆయన ఆగమనం అబ్రాహాం ఆలోచనను ప్రభావితం చేసింది. దేవుడు భూమిపై మానవునిగా జన్మిస్తాడని అబ్రహామునకు తెలుసా? ఎలా?

1. విశ్వాసమును బట్టి అనే మాట హెబ్రీ 11వ అధ్యాయములో ఒక్క అబ్రహాము విషయములోనే 4 సార్లు వాడబడింది. విశ్వాసం ద్వారా అతడు దానిని గ్రహించి ఉండాలి. అది పిలుపులోనే కనిపిస్తుంది. భూమి యొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వదించబడును (ఆది 12:3) ఇది దైవ ఆగమనం యొక్క ఆశీర్వాదం.

2. ఆదికాండము 15వ అధ్యాయం ప్రకారం ఆ రాత్రి అబ్రాహాం ఎలియాజరును దత్తత తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చాడు. దేవుడు ఆ ప్రయత్నాన్ని విరమింపజేసేందుకు దర్శనమందు మాట్లాడాడు. (తరువాయి 2వ పేజీలో)



# ఘనముగా జరిగిన గల్ఫ్ తెలుగు క్రిస్టియన్ కాన్ఫరెన్స్





2024 ఏప్రియల్ 11, 12 తేదీలలో గల్ఫ్ తెలుగు క్రిస్టియన్ కాన్ఫరెన్స్ చాలా ఘనంగా జరిగింది. దుబాయి పరిసర ప్రాంతాల నుండి అనేక మంది ఆ సభలలో పాల్గొని ఆత్మలో దీవింపబడ్డారు. జాన్‌వెస్లీ ఇంటర్‌నేషనల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, దైవజనులు డా॥జాన్‌వెస్లీ మరియు శ్రీమతి బ్లెస్సీవెస్లీ శక్తిగల దేవుని వాక్యమును అందించి ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా కలుసుకొని ప్రార్థించారు. స్తుతి ఆరాధన, దుబాయి క్రైస్ట్ వర్షిప్ సెంటర్ సండేస్కూల్ పిల్లల కార్యక్రమాలు, అద్భుత సాక్ష్యములు అనేకులను బలపరిచాయి. అనంతరం వచ్చిన ప్రతి ఒక్కరూ ప్రేమవిందులో పాల్గొన్నారు. గల్ఫ్ కాన్ఫరెన్స్‌కు సహకరించిన ప్రతి ఒక్కరిని



దైవజనులు డా॥ జాన్‌వెస్లీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం గల్ఫ్ కాన్ఫరెన్స్‌ను దుబాయిలో నిర్వహిస్తామని డా॥ జాన్‌వెస్లీ తెలియచేశారు.


దైవ సందేశాలు, రాష్ట్ర వ్యాప్తంగా జరుగు క్రైస్తవ సభల సమాచారం, చరిత్ర, సైన్సుతో కూడిన వాస్తవ సంఘటనలు, ప్రపంచ వ్యాప్త క్రైస్తవ వార్తా సమాచారం, అద్భుత సాక్ష్యములు, మిషనరీల జీవిత చరిత్ర, ఉపమానములు, ఇంకా అనేక ఆధ్యాత్మిక రచనలతో వెలువడుతున్న.....

**మహిమ శబ్దం** ఆధ్యాత్మిక వారపత్రిక

వివరాలకు : 9959917910, 9390209376

www.mahimasabdam.com.

mahimasabdam.tv@gmail.com


# మరణ పర్యంతము

పది దినములు మీకు శ్రమ కలుగును: మరణము వరకు నమ్మకముగా ఉండుము నేను నీకు జీవకిరీటమిచ్చెదను (ప్రకటన 2:10).

ఇటలీ స్వాతంత్ర్య సమర యోధుడు గుసీప్పీ గారిబాల్డి గారు (Giuseppe Garibaldi) స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో ప్రాముఖ్యమైన పాత్రను పోషించారు. ఇటలీలోని యువకులను ఉద్దేశించి ఆయన ప్రసంగం చేసారు. "మీరు ఈ యుద్ధములో పాల్గొని ఇటలీ దేశమునకు స్వాతంత్ర్యం తెచ్చుటకు సహాయ పడండి" అని అర్థించాడు. పిరికివాడైన ఒక యువకుడు గారిబాల్డిని సమీపించి "అయ్యా! నేను యుద్ధములో పాల్గొంటే నాకు ఏమి లభిస్తుంది?" అని అడిగాడు.

అందుకు గారిబాల్డి "గాయములు, మచ్చలు, దెబ్బలు, బహుశా మరణము సంభవించ వచ్చును. అయితే మీరు పొందే వీర మరణము వలన ఇటలీకి స్వాతంత్ర్యం వస్తుంది" అన్నాడు. ఆ యువకుడు వెంటనే ధైర్యము తెచ్చుకొని "అయితే నేను చచ్చేవరకు పోరాడతాను" అన్నాడు.

ఆత్మలను రక్షించుటకు మరణమును ఎదుర్కొనుటకు మనము సిద్ధముగా ఉన్నామా? యేసు ప్రభువు తన శిష్యులను తన సిలువను ఎత్తుకొని వెంబడించమని చెప్పారు. సిలువ కష్టములకు మరణమునకు సాదృశ్యము. ఆయన శిష్యులందరూ అనేక కష్టములను అనుభవించి మరణించారు.

ఆంద్రెయను సిలువ వేసారు. సీమోను పేతురును తలక్రిందులుగా సిలువ వేసారు. జెబదయి కుమారుడైన యాకోబును ఖడ్గముతో నరికి చంపారు. బర్తలోమయిని బ్రతికి యుండగానే చర్మము ఒలిచి చంపారు. అల్ఫయి కుమారుడైన యాకోబును దుడ్డు కర్రలతో కొట్టి చంపారు. తోమాను శూలముతో గ్రుచ్చి చంపారు. మత్తయిని కత్తితో పొడిచారు. తద్దయిని బాణములతో కొట్టి చంపారు. ఫిలిప్పును ఉరి తీసారు. మత్తీయను రాళ్ళతో కొట్టి చంపారు. అయిననూ వారందరు సంతోషముగా దేవునికి తమ్మును తాము సంతోషంగా సమర్పించు కొన్నారు. క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల, క్రీస్తు తోడి వారసులము (రోమా 8:27). – డా॥పి.బి.మనోహర్


రండి! వినండి!! రక్షణ పొందండి!!!

24వ వార్షిక

2024 మే 1,2,3 బుధ, గురు, శుక్రవారములు

ప్రతిరోజు రా॥ 7 గం॥లకు

**విమోచన సువార్త ఉజ్జీవ కూడికలు**

అన్నా గాస్పల్ చర్చ్ ఆవరణము నందు, వాడపాలెం

దైవవర్తమానికులు :

ముఖ్య అతిథి : బ్రదర్ ఐ.వి.కుమార్ గారు, ఊబలంక

అపొ.ఎమ్.సామ్యేల్ గారు, ఆత్రేయపురం

రెవ.ప్రేమరాజు గారు, యేసుక్రీస్తు పరిశుద్ధ సంఘం, రాజమండ్రి

రెవ.వై.రాజేష్ కుమార్ గారు, బొడ్డమెల్లిపాలెం



ప్రత్యేక పాటలు అన్నా గాస్పల్ చర్చ్ యూత్ వారిచే

ప్రతిరాత్రి భోజన సదుపాయం కలదు

ప్రేమతో ఆహ్వానించువారు :

దైవజనులు బిషప్ పి.ప్రభాకర రావు, శ్రీమతి మణికుమారి

అన్నా.గాస్పల్ చర్చ్, వాడపాలెం

వాడపాలెం, కొత్తపేట, రాముడునూతిమెరక, సంఘబిడ్డల ప్రార్థనా సహకారముతో...

సెల్ : 97047 82771, 95028 00861



**భళా! మంచి నాయకుడా**



29-4-2024 న 61వ జయంతి సందర్భముగా కృతజ్ఞతలతో...

**బిషప్ బోయినేని జయశంకర్ గారు**

పరిశుద్ధ గ్రంథములో లూకా 7:1-10లో రోగియైన తన దాసుని కొరకు శ్రద్ధ కలిగి ప్రభువు నొద్దకు వచ్చిన యజమానుని వలె మీరు సిఇఎమ్ స్టాఫ్ అయిన మా యెడల చూపిన ఆదరాభిమానములు వెలకట్టలేనివి. ఒక పని అనుకుంటే దానిని పూర్తి చేసే వరకు మీరు చూపే శ్రద్ధ, మీ అంకురిత దీక్షా, ప్రతి పనిలో మీరు కొరుకొనే ఖశ్చితత్వం, మాకు రాని విషయములను నేర్పించి ప్రొత్సహించే మీలోని నాయకత్వపు లక్షణాలు మరియు నేనున్నాను అని స్టాఫ్ కుటుంబములోని పిల్లల విధ్యా విషయములలో ప్రోత్సహించిన మీరు లేని లోటు మాకు ఎప్పటికి తీరనిదే మీ నాయకత్వములో పని చేసినందుకు గౌరవంగా బావిస్తూ దేవునిని స్తుతిస్తున్నాము...



**మీ నవీన్ రాజు & ఫ్యామిలీ**

జీవమార్గ సంఘకాపరి

సిఇఎమ్ క్యాంపస్, ధవళేశ్వరం, సెల్: 93979 05335



**మహిమ ప్రవేశము**



**బిషప్ డా॥ కె.ఎలీషా గారు**

మా ఆత్మీయులు సన్నిహితులు,
దేవుని పరిచర్యలో బహుబలముగా వాడబడి
అనేక మంది యేసయ్య రక్షణలోనికి నడిపించి అనేక
సంఘములు స్థాపించి సేవకులకు తర్ఫీదును ఇచ్చి
మంచి ప్రార్థనాపరులుగా అనేకులకు మార్గదర్శకులుగా
నిలిచిన దైవజనుల జ్ఞాపకాలు మరువలేనివి

**పాస్టర్ జోసఫ్ (రమణ)**

నా రక్షణ ప్రార్థనా మందిరము

ధవళేశ్వరం, ఇందిరకాలనీ, కేశవరం, రాజమండ్రి సంఘములు

SUBSCRIBE ...శబ్దము వచ్చిన తరువాత యేసు మాత్రమే అగపడును - లూకా 9:36

మహిమ శబ్దం

# MAHIMA SABDAM

## TELUGU CHRISTIAN NEWS

Christian News - Magic Shows - Testimony's
Daily Bread - Special Stories - Children Song's

www.mahimasabdam.com

Regd.No.19722

నీ పలువరుస కత్తెర వేయబడినవి - పరమ 4:2

# రాఫా డెంటల్

RAPHA DENTAL
GENTLE & AFFORDABLE DENTISTRY



ఆధునికంగా పళ్ళు కట్టుట, రూట్ కెనాల్ థెరపీ, సర్జరీ,
ఎత్తు పళ్ళు సరిచేయుట, డెంటల్ ఇంప్లాంట్,
చిగుళ్ళ వ్యాధుల చికిత్స, కాస్మొటిక్ ట్రీట్‌మెంట్
మొదలగు చికిత్సలు చేయబడును

అందుబాటు ధరలో చికిత్స చేయబడును

Dr.CHITRA CHUGANI MDS
Periodontist & Implantologist

రాఫా డెంటల్, డోర్.నెం.27-1-5, దాసరి ఆఫ్టీషియన్స్ ప్రక్కన,
నందం గనిరాజు సెంటర్, రాజమండ్రి, సెల్ : 9000 136 977

మహిమ శబ్దం ఆధ్యాత్మిక వారపత్రిక

మహిమ శబ్దం ఆధ్యాత్మిక వారపత్రిక E - PAPER కొరకు
మన వెబ్‌సైట్ QR CODE స్కాన్ చేసి చదువగలరు.

WWW.MAHIMASABDAM.COM

## ధవళవర్ణుడు అపొస్తలిక్ చర్చ్

కన్నీటి ప్రార్థనలు | ఆత్మీయ గీతాలు
శక్తివంతమైన స్తుతి ఆరాధన | ఉన్నతమైన ఉపదేశం

ఆదివారం ఉ॥ 6 గం॥లకు ఆరాధన
సుబ్బారావునగర్, క్వారీమార్కెట్, రాజమండ్రి

ఆదివారం ఉ॥ 8.30 ని॥లకు ఆరాధన
బాలాజీపేట, బొమ్మూరు, రాజమండ్రి

ఆదివారం ఉ॥ 11.30 ని॥లకు ఆరాధన
కడియం, కడియం మండలం



పాస్టర్ విజయబాబు
సెల్ : 99129 17228

ఇది మొదలుకొని నేను మిమ్మును ఆశీర్వదించెదను - హగ్గయి 2:19

## బిషప్ జోసఫ్స్ చర్చ్

www.bibleplacechurch.org
bibleplacerjy@gmail.com

Bible Place Church
Follow us :
YouTube



బైబిల్ ప్లేస్
రాజమహేంద్రవరం
తూ॥గో॥జిల్లా - 533103

ఆరాధన కార్యక్రమములు
ఆదివారం
ఉ॥ 9.30 ని॥లకు
ఆరాధన
శుక్రవారం
మ॥ 12 గం॥లకు
ఉపవాస ప్రార్థన

దైవజనురాలు
పాస్టర్ సోని సునంద్ దేవరపల్లి & ఫ్యామిలీ
B.Sc., B.Ed., B.D., D.D

ప్రార్థన అవసరతలకు 95025 16403

మరనాథ
ఆయన మీతో చెప్పునది చేయుడి యోహాను 2:5
దేవుడు ఫాధర్ యం.దేవదాసు అయ్యగారికి బైలుపరచిన బైబిలు మిషను
వ్యవస్థాపకులు
సెయింట్ ఫాధర్. యం.దేవదాసు అయ్యగారి జన్మస్థలం

## బైబిలు మిషను, జేగురుపాడు

ప్రతి ఆదివారం ఉదయం 7.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు
ప్రతి ఆదివారం ఆరాధన
సమయం 10.00 గం॥ల నుండి 1.00 గం॥ వరకు
సోమవారం స్వస్థత శాల
ఉదయం 10.00 గం॥ల నుండి 3.00 గం॥ల వరకు
మంగళవారం విజ్ఞాపన ప్రార్థనలు
సాయంత్రం 7.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు
శుక్రవారం సన్నిధి
ఉదయం 11.00 & సాయంత్రం 7.00 గం॥లకు
ఉపవాస ప్రార్థనలు ప్రతి నెల రెండవ శనివారం
ఉదయం 10.00 గం॥ల నుండి 3.00 గం॥ల వరకు



సెల్: 9491641679

## పావురస్వరం టి.వి. కార్యక్రమములు

శుభవార్త ఛానల్‌లో ప్రతి మంగళవారం ఉ॥ 7.30 ని॥లకు
నిరీక్షణ ఛానల్‌లో ప్రతి సోమవారం సా॥ 4.30 ని॥లకు
కాంతి ఛానల్‌లో ప్రతి శుక్రవారం రా॥ 8.30 ని॥లకు
కాంతి ఛానల్‌లో ప్రతి ఆదివారం రా॥ 8.30 ని॥లవరకు
ప్రతి ఆదివారం ఉ॥ 10.30 గం॥ల నుండి 12.30 గం॥ల వరకు మొదటి ఆరాధన
ప్రతి ఆదివారం రాత్రి 7 గం॥ల నుండి 9.30 గం॥ల వరకు రెండవ ఆరాధన
ఎ.పి.ప్రేయర్‌టవర్‌లో ఆరాధన జరుగును. మీకు వీలు అయితే ఒక్కసారి రండి.



బ్రదర్ విశ్వం గారు,
పసువుల ఆసుపత్రి ఎదురుగా, కోర్లమ్మపేట,
రాజమండ్రి, సెల్ : 9848571523

## బైబిలు భౌగోళిక పటములు

క్రైస్తవుడగు ప్రతి వ్యక్తి తప్పక
తెలుసుకోవలసిన పటములు

వెల
రూ॥ 150/-

బైబిలు భౌగోళిక పటములు
Bible Maps
Please send your postal address
9346952065 & 9963126364.
Phone Pay & Google Pay no.
7032087752. Pages 100. ₹150.
Copies sent by Register Post.

ఎస్.విజయ ప్రకాష్ సువార్తికులు
డోర్.నెం.58-24-22, సంజీవయ్యనగర్, రాజమండ్రి - 5,
సెల్: 93469 52065, 99631 26364

ఫోన్ పే & గూగుల్ పే : 70320 87752 | బుక్స్ రిజిస్టర్ పోస్ట్‌లో పంపబడును


నీ వాక్యము నా పాదములకు దీపము - కీర్తనలు 119:105

## వర్డ్ విజన్ క్రిస్టియన్ బుక్ హౌస్



వివిధ భాషలలో బైబిళ్ళు, స్టడీ బైబిళ్ళు, వ్యాఖ్యానాలు,
చరిత్ర పుస్తకాలు, భక్తుల జీవిత చరిత్రలు,
పాటల పుస్తకాలు, గోడ వాక్యాలు,
గిఫ్ట్ ఆర్టికల్స్ మొదలగునవి అమ్మబడును

వర్డ్ విజన్ క్రిస్టియన్ బుక్ హౌస్
బైపాస్ రోడ్, రాజమండ్రి - 3, సెల్ : 99892 79403




రాబర్ట్ రైక్స్ ఇంగ్లాండులో 17వ శతాబ్దములో గ్లొస్టర్ పట్టణములో మంచి భక్తి శ్రద్ధలుగల తల్లి దండ్రులకు జన్మించాడు. ఈయన పట్టుదల, కార్యదక్షత గల శ్రమజీవి. మంచి యౌవనప్రాయములో ప్రభువుకు సమర్పించుకొన్న వ్యక్తి. ఒక మంచి పేరుగొన్న వార్తా పత్రికకు ముఖ్య సంపాదకునిగా పని చేసేవాడు. ఒక ఆదివారమున చర్చికి వెళ్ళుచుండగా రోడ్డుమీద చాలా మంది పిల్లలు అల్లరచిల్లరగా ఆడుకొంటూ ఉన్నారు.

జులాయిగా తిరుగుచున్నారు, ఒక క్రమశిక్షణ పద్ధతి లేకుండా బాధ్యతా రహితముగా తిరుగుచున్నారు. వారికి బుద్ధి చెప్పి గద్దించి సక్రమమైన మార్గములో పెట్టేవారే లేరా! అని మనస్సులో చాలా బాధపడి మధనపడి అలా ఆడుకొంటున్న పిల్లల్ని అనేక ప్రశ్నలడిగి కారణాలు తెలుసుకున్నాడు. కారణాలేమైనా, పిల్లలు తమ సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. కాలము బహు విలువైనది. అది మరలా తిరిగి రాదు. రాబర్ట్ రైక్స్ గారు చర్చిలోకి వెళ్ళి కూర్చున్నాడే కాని ఆయన మనస్సు మనస్సులో లేదు. ఈ పిల్లలు తమ సమయాన్ని దుబారాగా గడిపితేవారికి ఏమి ప్రయోజనము? పిల్లలు ఏది క్రమమో, ఏది సరియైనదో ఆ ప్రాయములో తెలుసుకొనకపోతే ఎప్పుడు తెలుసుకొంటారు. యిలా వీరందరూ నాశనమైపోవలసినదేనా? యిలాగైతే దేశములో ఏ ఒక్కరూ మనకు మిగలరు. బుద్ధిచెప్పేవాడు సరియైన మార్గము చూపించేవాడు నేర్పేవాడు లేకపోతే ఎలా నేర్చుకుంటారు అనేది ఈయన మనోవేధన, వ్యధ అలా ఆలోచిన్నా, ఆలోచిన్నా దుఃఖముతో బాధపడేవాడు. వీధిలో విచ్చలవిడిగా తిరిగే ఆ పిల్లల్ని అందరితో విషయ సేకరణ గావించిన పిదప ఆయన తెలుసుకున్న సత్యమేదనగా మిల్లులో పనిచేసే బాలకార్మికులు వారు. ఆరు రోజులు పనిచేసి కష్టపడి సొమ్ము ఆర్జించి దానిలో కొంత సొమ్మును తల్లిదండ్రులకిచ్చి మిగిలినదాంతో యిష్టము వచ్చినట్లు ఖర్చుచేసేవారు. కొందరు ధూమపానము, కొందరు జూదము, పోకిరి పనులు చేస్తూ సమయమును వృధాగా గడుపుచున్నారు. శెలవుదినము జల్సాగా, సంతోషముగా గడపాలనేది వారి అభిమతం. ఆ పిల్లలకు దేవుని సన్నిధానానికెళ్ళి గడపడమంటే వృద్ధులే లేక పెద్దలే చర్చికి వెళ్ళాలి. మేము పిల్లలము ఆడుకోవాలనే ఆదినములలో పరిపాటి లేక ఆనవాయితి. అలా చాలా సమయాన్ని వృధాగా గడిపి సమయమును దుర్వినియోగపర్చుచు దుర్భాషలు ఆడుతూ కాలాన్ని గడుపుతుండేవారు. ఇట్టి దుస్థితిని చూసిన రాబర్ట్ రైక్స్ దుఃఖవదనుడై. చాలా ఆలోచించసాగెను. క్రీస్తుయేసుని బాల్యము నుండి తెలుసుకోవలసియుంది. "మొక్కైవంగనిది మానై వంగుతుందా" బాల్యము నుండి క్రమశిక్షణతో పెరిగితే దేవునికి ప్రయోజనకరముగా వ్యక్తిగతముగాను ఒకనికిమేలు. అప్పుడు దేశమునకు, మంచి పౌరులు లభిస్తారు. దేశము సుభిక్షముగా ఉంటుంది. దేవుని యందు భయము, భక్తి ఏర్పడుతాయి. అదే జ్ఞానమునకు మూలము. అప్పుడు నా దేశస్తులు జ్ఞానవంతులై నాదేశ అభివృద్ధికి కారకులవుతారు. బాలుడైన యేసు మనుష్యుల దయ యందును, దేవుని దయయందును వర్ధిల్లెను. రాబర్ట్ రైక్స్ ఆ బాలోద్దరణకై దేవుని సన్నిధిలో మోకాళ్ళపై ఆత్మల భారము గలిగి కన్నీరు మున్నీరుగా ప్రార్ధన చేయుచుండెను. సమయమున్నప్పుడు పెద్దలతోను అనుభవనీయులతోను సంప్రదించి ఏదైనా ప్రణాళికా క్రమబద్ధముగా పిల్లలను తీర్చి దిద్దాలనే ప్రగాఢ వాంఛ. దీని విషయములో పదే పదే గోజాడి ప్రార్ధన చేయుచుండెను. పట్టుదలతో ప్రార్ధన చేయుచుండగా ఒకానొక దినమున దేవుని చల్లని మెల్లని స్వరము "ప్రయత్నించి చూడు" అని వినిపించెను. ఆ దేవుని ఆజ్ఞకు ఉపదేశమునకు లోబడి దేవునిగూర్చి చంటిపిల్లలను తర్ఫీదు చేసే పరిశ్రమలో ఉత్తమకృషి చేయాలని "నిర్ణయించుకున్నాడు. వెంటనే ఆయన ఒక ఇంటిని అద్దెకు తీసుకొని సండేస్కూల్ ప్రారంభించెను. రాబర్ట్ రైక్స్ ఇద్దరు చంటిపిల్లలకు నేర్పించి ఓర్పు సహనముండే ఉపాధ్యాయులను నియమించివారికి నెలకు 15/- రూపాయలు జీతముగా నిర్ణయించి ఆదివారపు బడి ఉదయం 12 గంటలకు మరలా 2 గంటల నుండి 4 గంటల వరకు నడిపించిరి. వీధిలో ఆకతాయిగా తిరిగే పిల్లలను ఒక సక్రమపద్ధతిలో క్రమశిక్షణతో ఆదివారపు బడి నడిపించేవాడు. దానిని బట్టి పిల్లలు వినయవిధేయతలు నేర్చుకుని నమ్రత నేర్చుకున్నారు. "విద్య యొసగు వినయంబు" దేవునియందు భయము, భక్తివాటంతట అవే సమకూరుచున్నవి. ఇందును బట్టి వారికి జ్ఞానము ప్రాప్తిస్తుంది. ఆ సండేస్కూల్ పిల్లలు ఏవి చెయ్యాలో, ఏవి చెయ్యకూడదో తెలుసుకున్నారు. దేవునివాక్యమనే వెలుగువెడలిన తోడనే చీకటి పలాయనం చిత్తగిస్తుంది. ఆదివారపుబడిలో ఆటలు, పాటలు, పోటీలు అభినయగీతములు, బొమ్మలకు రంగులు వేయుట, చదువుట, వ్రాయుట, వాటితోపాటు బైబిల్ సత్యములను గ్రహించి జీవిత పాటములను నేర్చుకొనే అవకాశం లభిస్తుంది. చిన్న ప్రార్ధనలను నేర్పించి ఆహారము కూడా పెట్టేవారు. మతఛాందసముగల కొందరు వ్యక్తులు ఆదివారపు బడిని వ్యతిరేకించి పరిశుద్ధదినమును అపవిత్రపరచుచున్నాడని రాబర్ట్ రైక్స్‌ను నిందించిరి. కొందరైతే ఇది మంచి పని, సత్కార్యము ఆదివారపు బడి మనపిల్లలను మంచిమార్గములో దేవుని మార్గములో నడిపించుతుంది. గనుక ఇది ఏమీ చెడ్డపని కాదు, మంచిపనే అని ప్రోత్సహించిరి. ఆదివారపు బడి క్రమక్రమముగా ఇంగ్లాండు దేశమంతట వ్యాపించింది. దీని వలన అనేక మంది భావి దేశ పౌరులను చిన్నప్పటినుంచేవారికి సరియైన మార్గము నేర్పించుట వలన పెద్దవాడై దేశానికి మన సమాజానికి దేవునికి ముఖ్యముగా వ్యక్తిగతంగా ప్రతీ ఒక్కరికి మేలు కలిగిస్తుంది. మొదట ఇంగ్లాండు క్రమక్రమేణా యూరప్ దేశాలన్నింటిలో ఈ సండేస్కూల్ వ్యాపించింది. అలా ప్రపంచమంతట ఆదివారపుబడి వ్యాపించింది. ప్రపంచ సండేస్కూల్ యూనియన్ అనే ఒక సంస్థ ఆవిర్భవించింది. దాని ముఖ్య గురి ఏమంటే "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడు" (సామెతలు 22:6).

వరల్డ్ సండేస్కూల్ యూనియన్ అనుబంధముగా మన ఇండియాలో "సండేస్కూల్ యూనియన్ ఆఫ్ ఇండియా'' కూనూరులో వుంది. ఈ సంస్థ భారతదేశములో అన్ని భాషలలో సండేస్కూల్ జరుగుటకు ప్రోత్సహిస్తున్నారు. అంతేగాక సండేస్కూల్ పాఠ్యపుస్తకములు, ఇతరత్రా పిల్లలకు అనుబంధ పాఠ్యభాగములను ముద్రించి, పిల్లల ఔన్నత్యానికి ఎంతో కృషిచేస్తుంది. ప్రపంచమంతట సండేస్కూల్ కార్యక్రమములు ఉత్సాహంగా జరుగుచున్నవి. ఈనాటి బాలలే రేపటి సంఘ సంస్కర్తలు, మిషనరీలు, కాపరులు, నాయకులు, సువార్తికులు గనుక మన పిల్లల మీద మనం జాగ్రత్త తీసుకోవాలి. ఏ సంఘము వారి పిల్లల మీద సండేస్కూల్ పిల్లల మీద శ్రద్ధ తీసుకుంటుందో, ఆ సంఘము, వృద్ధిపొందుతుంది. "నేటి పిల్లలు భావి క్రైస్తవ సంఘానికి మూల స్తంభాల వలె నిలుస్తారు". ఒక్క మనిషి, దైవజనుడు "రాబర్ట్ రైక్స్" చేసిన మంచిపనిని దేవుడు దీవించి తనకొరకు ఒక మహా సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు.

– డా॥ పాశల సాధు సుందర్ సింగ్

# పరలోక పిలుపు



**మంచి దైవజనులు, సువార్త యోధులు, అలుపెరుగని సువార్త ప్రకటించి ప్రార్ధనాపరులుగా సాక్ష్యమును సంపాదించిన దైవజనులు ధవళేశ్వరం, బొమ్మూరు, వేమగిరి పాస్టర్స్ ఫెలోషిప్ ఛీప్ పేట్రిన్‌గా ఉంటూ ఎంతో సహాయ సహకారములు అందించి, ప్రోత్సహించిన ధవళేశ్వరం హౌస్ ఆఫ్ ప్రేయర్ వ్యవస్థాపకులు,**

**బిషప్ డా॥ కె.ఎలీషా గారు**

**2024 ఏప్రియల్ 21వ తేదిన ప్రభువు పిలుపునందుకున్నారు.**
**వారి జ్ఞాపకాలు మరువలేనివి.**
**వారి కుటుంబమునకు ఆదరణ కలగాలని ప్రార్ధిస్తూ...**

**రెవ.ఎన్.సాల్మన్**

న్యూ డి.బి.వి.పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు, వేమగిరి గట్టు

# నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ సమావేశం

**రాజమండ్రి :** 2024 ఏప్రియల్ 23వ తేది మంగళవారం రాజమహేంద్రవరం, ఆనందనగర్, జెరూసలేం ప్రేయర్ ఫెలోషిప్ చర్చ్ నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ సమావేశం జరిగింది. ఈ సమావేశమునకు ఇంచుమించుగా 200 మంది హాజరయ్యారు. ఈ సమావేశంలో నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ రాష్ట్ర నాయకులు ప్రెసిడెంట్ బి.నవీన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బి.అమృత రావు, ట్రెజరర్ వై.శేఖర్ బాబు తదితరుల ఆధ్వర్యంలో తూ॥గో॥జిల్లా నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ నూతన కార్యవర్గపు ఎంపిక చేయబడింది. ప్రెసిడెంట్‌గా రెవ.వి.దాస్ బాబు, సెక్రటరీగా రెవ.కె.జాన్ డేవిడ్, ట్రెజరర్‌గా రెవ.డేవిడ్ నవీన్ నియమించబడ్డారు. రాబోవు కాలమున క్రైస్తవులు ప్రతి ఒక్కరికి తమ సేవలను అందించబోతున్నామని కార్యవర్గ సమావేశంలో నాయకులు తెలియజేశారు.



## గమనిక

మహిమ శబ్దం పత్రికలో ప్రచురించిన యే ప్రకటనలు అయిన ఇతర పత్రికలలో ప్రచురించినచో మహిమ శబ్దం యాజమాన్యానికి ఎట్టి సంబంధము లేదు. మరియు మా పత్రికలో ప్రచురించే ప్రకటనలకు మహిమ శబ్దం యాజమాన్యానికి ఎట్టి సబంధం లేదు. ప్రకటనలకు పూర్తి బాధ్యులు ప్రకటనకర్తలు మాత్రమే. దయచేసి పాఠకులు గమనించగలరు.

# మొదటి జ్ఞాపకార్థ కూడిక





ఒక సాధారణ కుటుంబములో పుట్టిన వ్యక్తి ,
క్రీస్తు కృపను పొంది ఆయన సేవకు సమర్పించుకుంటే
ఎంతటి ఉన్నత కార్యలైనా చేయవచ్చు అని
సాధించి చూపిన మీ మాదిరి మాకు నిత్య ప్రేరణనిస్తుంది.
మా అభ్యున్నతి కొరకు నిరంతరము కాంక్షిస్తు ,
మమ్మును ఉన్నత చదువుల చదివించి, సమాజములో గౌరవనీయమైన స్థితిలో నిలువబెట్టారు.
దేవుని ప్రేమను తండ్రిగా మాకు అందించి, వాక్యమును బోధించి దేవుని పిల్లలుగా తీర్చిదిద్దారు.
CEM అనే ఒక పెద్ద కుటుంబాన్ని మా కిచ్చి క్రీస్తు పరలోక కుటుంబమునకు మీరు వెళ్ళారు.
మీరు చూపిన ప్రేమ, మీరు చెప్పిన మాట, మీరు వేసిన బాట, మీరు విడిచిన మాదిరి
అనుసరిస్తూ నిత్యము మీ స్మృతులతో దేవునిని మహిమ పరుస్తూ...

## మీ కుటుంబసభ్యులు







## బిషప్ బోయినేని జయశంకర్ గారు

జననం : 29-4-1963
మహిమ ప్రవేశం : 27-04-2023

భార్య : శ్రీమతి జయలక్ష్మి

కుమారుడు - కోడలు
డా॥ బి.జయప్రశాంత్ - శ్రీమతి డా॥దీప్తి

కుమార్తెలు
దీప్తి గ్రేస్, కీర్తిగ్రేస్, మేఘనా గ్రేస్

చిన్న కుమారుడు : చరణ్ తేజ్

కుమార్తె - అల్లుడు
శ్రీమతి డా॥ జయదేవి - సతీష్

మనవళ్ళు
అభిషేక్ ప్రణీత్, ఆదిత్యా కౌషిక్

CEM ఫ్యామిలీ

ప్రధమ జ్ఞాపకార్థ కూడిక : 2024 ఏప్రియల్ 27వ తేది శనివారం, ఉ॥ 10 గం॥లకు CEM క్యాంపస్, ధవళేశ్వరం నందు జరుగును. సెల్ : 93979 05335

జీవమార్గ సంఘము




CEM క్యాంపస్






జయ హైస్కూల్

దీప్తి గ్రేస్ అగాపే వృద్ధుల ఆశ్రమం



CEM హాస్పటల్



# ప్రభువు నందు నిద్రించిన బిషప్ డా॥కె.ఎలీషా గారు



ధవళేశ్వరం : సీనియర్ దైవజనులు, ధవళేశ్వరం, ఎర్రకొండ మీద వున్న హౌస్ ఆఫ్ ప్రేయర్ వ్యవస్థాపకులు బిషప్ డా॥ కాళేపల్లి ఎలీషా గారు 21 ఏప్రియల్ 2024 తేదిన ప్రభువు నందు నిద్రించారు. ఆయనకు నాలుగురు సంతానము ఆయన మృతి పట్ల క్రైస్తవనాయకులు, రాజకీయ నాయకులు, విశ్వాసులు, బంధువులు, ఆయన చేసిన సేవను కొనియాడి కుటుంబసభ్యులకు ఆదరణ కలుగులాగున ప్రార్ధన చేసారు. 22వ తేదిన వేల మందితో బరియల్ నిర్వహించారు. కాళేపల్లి



జయరామిరెడ్డి (బిషప్ ఎలీషా) గారు 1939వ సంవత్సరములో చిత్తూరు జిల్లా, దాసుల పల్లి గ్రామములో జన్మించారు. ఆయనకు 6 సంవత్సరముల వయస్సులో శరీర అనారోగ్యముతో బాధపడుతుండేవారు. బాపట్లలో గల పాస్టర్ ప్రసాదరావు చేసిన వాక్యం ద్వారా దేవుడు ఎలీషాతో మాట్లాడిన తదుపరి, దేవుడు స్వస్థత, కలుగజేయగా, వెంటనే బాప్తిస్మము తీసుకొని 1960వ సంవత్సరములో దేవుని పరిచర్య కొనసాగించారు. ప్రభుదర్శనమును బట్టి ధవళేశ్వరం, ఎర్రకొండలో హౌస్ ఆఫ్ ప్రేయర్ ప్రారంభించి అనేక ప్రాంతములలో 30కి పైగా సంఘములు స్థాపించి సేవకులకు ఏర్పాటు చేసారు. ఒకవైపు ప్రభువు పరిచర్య మరొకవైపు అనాధలకు, వికలాంగులకు, విదవ రాండ్రులకు తమ వంతు సహాయము చేస్తుండుడేవారు. ఆయన ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు వారిలో అంతర్జాతీయ సువార్తికులు కీ॥శే॥గిద్యోను కాళేపల్లి, జాషువా ఇంటర్‌నేషనల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవ.జాషువా కాళేపల్లి. ఆయన జీవితం అనేక మందికి ఆదర్శకరము. బిషప్ డా॥కె.ఎలీషా గారు 86 సంవత్సరములు జీవితంలో 66 సంవత్సరములు ప్రభుసేవా పరిచర్య ద్వారా ప్రభువు మహిమకరముగా జీవించి అనేక వేల మందిని రక్షణలోనికి నడిపించారు.



## మిన్నయైన ప్రేమ

తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువాని కంటె ఎక్కువైన ప్రేమ గలవాడెవడును లేడు (యోహాను 15:13).

ఐదు సంవత్సరాల వయస్సు గల మేరీకి గుండెకు రంధ్రం ఉండుట వలన ఆపరేషన్ చేసారు. డాక్టర్ ఆమెకు రక్తము ఎక్కించాలని చెప్పాడు. మేరీ రక్తము గ్రూపు బి నెగిటివ్. అదే గ్రూపు ఉన్న రక్తము ఆమె అన్నయైన జిమ్మీ వద్ద ఉన్నది. అందువలన జిమ్మీని "నీ చెల్లి కొరకు రక్త దానము చేస్తావా?" అని అడిగాడు. 12 సంవత్సరాల జిమ్మీ రెండు నిమిషాలు ఆలోచించి "ఆమెకు అవసరమైతే ఇస్తానండీ!" అన్నాడు. జిమ్మీ రక్తము తీస్తూ ఉండగా జిమ్మీ "డాక్టర్ గారూ! నేను ఎప్పుడు మరణిస్తాను?" అని అడిగాడు.

డాక్టర్ ఆశ్చర్యంగా "ఎందుకు?" అని అడిగాడు. "మరి నా రక్తము తీసుకొంటున్నారు గదా?" అన్నాడు జిమ్మీ. డాక్టర్ "రక్తము తీసుకొంటున్నంత మాత్రాన నీవు చనిపోతానని అనుకొంటున్నావా?" అని అడిగాడు. "అవునండీ!" అన్నాడు జిమ్మీ.

"చనిపోతానని తెలిసి కూడ నీ చెల్లెలి కోసం రక్తము ఇవ్వడానికి సిద్ధపడ్డావా?" అని డాక్టర్ అడిగాడు."అవునండీ!" అన్నాడు జిమ్మీ.

జిమ్మీ తన అమాయకత్వము వలన రక్త దానము చేసినంత మాత్రాన చనిపోతాను అనుకొన్నాడు. అయినా తన చెల్లెలి నిమిత్తం ప్రాణ త్యాగము చేయడానికి సిద్ధ పడ్డాడు. అటువంటి ప్రేమనే మనము చూపించాలని యేసు ప్రభువు ఆశిస్తున్నారు. – డా॥పి.బి.మనోహర్







# గొప్ప జ్ఞానము

## (సామెతల గ్రంథం సంగ్రహ సమీక్ష)



**1. ఉపోద్ఘాతం :**

**1. గ్రంథ రచయితలు :**

ఈ గ్రంథంలోని సామెతలు దరిదాపు అన్నీ సొలొమోను వ్రాసాడు. 1రాజులు 4:32 ప్రకారం సొలొమోను 3000 సామెతలు వ్రాసాడని తెలుస్తున్నది. వాటిలో నుండి తీసుకొనబడిన సామెతలే ఈ గ్రంథంలో పొందుపర్చబడినవి. 1-24 అధ్యాయాలలోని సామెతలను సొలొమోను స్వయంగా వ్రాసాడు. 25-29 అధ్యాయాలలోని సామెతలు సొలొమోను చెప్పినవే అయినా, యూదా రాజైన హిజ్కియా సేవకులు వాటిని సేకరించి వ్రాసారు. 30వ అధ్యాయమును ఆగూరు అనే దీర్ఘదర్శి మరియు 31వ అధ్యాయాన్ని రాజైన లెమూయేలు వ్రాసాడు. ఏది ఏమైనా ఈ 31 అధ్యాయాల కూర్పు సొలొమోనుదే.

**2. రచనకాలం :**

సొలొమోను పరిపాలన కాలంలో అనగా (క్రీ॥పూ॥ 971-931 సం॥ల మధ్యకాలంలో).

**3. సామెతల గ్రంథ ఉద్దేశం :**

మానవుడు జ్ఞానం ఎలా పొందగలడో, తెలివి, వివేకము, క్రమ శిక్షణతో కూడిన జీవితం ఎలా జీవించాలో, నీతిన్యాయం. యథార్థమైనది చేయుట ఎలాగో నేర్పించుట (సామెతలు 1:2,3). అనుదిన జీవితానికి దైవిక జ్ఞానం అవలంబింప చేయుట. నైతిక సూత్రాలు, సలహాలు అందించుట.

**4. ముఖ్యాంశం :** జ్ఞానం.

**5. మూల వాక్యం :**

"యెహోవాయందు భయభక్తులు కలిగి యుండుటయే జ్ఞానమునకు మూలము. పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివియే వివేచనకు ఆధారము" (సామెతలు 9:10).

**6. గ్రంథ విశిష్టత :**

సామెతల గ్రంథాన్ని ఏ కోణంలో పరిశీలించి, పఠించినా మనకు గోచరమయ్యేది జ్ఞానము. అందుకే ఇది జ్ఞాన సాహిత్యంలో చేర్చబడింది. యోబు, కీర్తనలు, సామెతలు, ప్రసంగి, పరమగీతములు పాతనిబంధనలో పద్యభాగంలో చేర్చబడినప్పటికీ, సామెతల గ్రంథం జ్ఞానం సంతరించుకొని ఈ గ్రంథాలన్నిటికి తలమానికం అయింది.

సామెతల గ్రంథంలో ఆచరణాత్మకమైన దైవిక జీవితాన్ని కనుగొనగలము. ఇందులో జీవితంలోని ప్రతివిధమైన సంబంధాల్ని గూర్చి చెప్పబడింది. దేవుని పట్ల, పొరుగువారి పట్ల, తల్లిదండ్రులు మరియు పిల్లల పట్ల మన బాధ్యతలను, దేశపౌరులుగా మనం తప్పకుండా పాటించాల్సిన వాటిని గూర్చి ఈ గ్రంథం తెలియజేస్తుంది.

యూదులు, సామెతల గ్రంథాన్ని దేవుని మందిరపు వెలుపలి ఆవరణంగా, ప్రసంగి గ్రంథాన్ని పరిశుద్ధ స్థలంగా, పరమగీతాల గ్రంథాన్ని అతిపరిశుద్ధ స్థలంగా పరిగణిస్తారు. మనకు తెలిసినట్లుగా వెలుపలి ఆవరణంలో దహన బలులర్పించే బలిపీఠం, దాని బూడిదను ఎత్తే జల్లెడ ఉంటుంది. సమర్పణగల మనస్సుతో, శుద్ధ హృదయంతో ఈ గ్రంథాన్ని చదివితే అనేక విషయాలను మనం నేర్చుకోవచ్చును. అది మనల్ని వెలుపలి అవరణంలోనికి ప్రజల మధ్యకు తీసుకొని వెళ్తుంది. అక్కడ వారి దైనందిన జీవితం, జీవిత మార్గంలో ఇతరులతో గల సంబంధాలు మనకు కనిపిస్తాయి. మన దైనందిన జీవితానికి, నీతియుక్తమైన జీవితానికి సూచనలనిచ్చే గ్రంథమిది.

1. కీర్తనల గ్రంథంలో క్రైస్తవుడు మోకాళ్ళపై కనిపిస్తాడు. - సామెతల గ్రంథంలో తన కాళ్ళపై నిలబడ్డం చూస్తాము.

2. కీర్తనల గ్రంథం క్రైస్తవుని ఆరాధన కోసం ఉద్దేశించబడింది. - సామెతల గ్రంథం క్రైస్తవుని నడతను గూర్చి ఉద్దేశించబడింది.

3. కీర్తనల గ్రంథం ప్రార్థన గదికి సంబంధించినది. - సామెతల గ్రంథం వాణిజ్య మరియు క్రీడా స్థలాలకు, కుటుంబానికి సంబంధించినది.

సామెతల గ్రంథం మనుష్యులను జ్ఞానులు మరియు బుద్ధిహీనులు అని రెండు వర్గాలుగా విభజిస్తుంది. జ్ఞానము అనే మాటలోనే ఈ గ్రంథ నిజసౌందర్యం, శక్తి గుప్తమైయున్నది. ఈ జ్ఞానమే కొత్త నిబంధనలో శరీరధారిగా అవతరించిన వాక్యమని స్పష్టమౌతున్నది. ఈ గ్రంథంలో క్రీస్తు ప్రత్యక్షపరచబడ్డాడు. జ్ఞానముగా ఆయన నిత్యత్వంలో దేవునితో నివసించాడు. సామెతలు 8:28-31; యోహాను 1:1,2; హెబ్రీ 1:2; కొలస్సీ 2:3తో పోల్చి చదవండి. సామెతల గ్రంథంలో జ్ఞానము అనే మాట ఉపయోగించబడిన ప్రతిచోట క్రీస్తు అనే మాట నుంచి చదవండి (1కొరింథీ 1:30).

**7. సామెతల గ్రంథ చిత్రీకరణ :**

ఈ గ్రంథము, జీవిత పాఠశాలలో చేరబోతున్న ఒక యౌవనస్తుని చిత్రాన్ని సూచిస్తుంది. ఇది అతని మొదటి పాఠం 1:7. అతని ఎదుట రెండు పాఠశాలలున్నాయి. అవి 1) జ్ఞానుల పాఠశాల 2) బుద్ధిహీనుల పాఠశాల. ఈ రెండు కూడా వాటి వాటి పాఠాలను బోధిస్తున్నాయి. వాటిలో దేనిని ఎన్నుకోవాలో ఆ యౌవనస్తుడే నిర్ణయం చేసుకోవాలి. ఈ గ్రంథం చదువుతూ ఉండగా మిమ్మల్ని మీరు ఆ యౌవనస్తుని స్థానంలో వుంచుకొని చిత్రీకరించుకొని, జీవిత పాఠాలను నేర్చుకోవాలని మా ఆకాంక్ష

**2. సామెతల గ్రంథ విభజన :**

సామెత అంటే ధీర్ఘకాల అనుభములో నుండి తీసుకొనబడిన చిన్న వాక్యము. ఇవన్నీ జీవిత అనుభవంలో, నేర్చుకొన్న పాఠాలు. ఈ గ్రంథంలోని ప్రతి వచనం ఒక ఆత్మీయ పాఠమే. ఒక విధంగా చెప్పాలంటే ఈ గ్రంథం ఒక కలగూర గంపలాంటిది. దాని నుండి మనకు అవసరమైన. అంశాలకు సంబంధించిన విషయాలను సంగ్రహించాలి. అనగా అంశాల వారిగా విభజించి చదివితే సులభంగా అర్థమౌతుంది.

ఈ గ్రంథంలోని సూచనలను బట్టి మూడు ప్రధాన భాగాలుగా విభజించవచ్చును.

**1. యౌవనస్తులకు ఉపదేశం 1-10 అధ్యా. :**

ఈ భాగాన్ని "కుమారులకు ప్రసంగాలు" అని చెప్పవచ్చును. ఇవి "ఆగుము! చూడుము! వినుము! అని దేవుడిచ్చే హెచ్చరికలు. ఈ భాగంలో దేవుని యందలి భయము అన్నది, తండ్రి ప్రేమకు ప్రతిగా అతనికి బాధకలిగించేదేమైనా చేస్తానేమో అని కుమారునిలో ఉండే భయమే గాని, దేవుడు ఏదో చేస్తాడు అన్న భయము కాదు. ఈ భయము ప్రేమలో నుండే పుడుతుంది. దేవునికి దుఃఖం కలిగించకూడదన్న ఈ భయం దైవికమైన జీవితానికి దోహదపడుతుంది. జ్ఞానానికి మూలమైన యేసుక్రీస్తుతో సరైన సంబంధం లేనంతవరకు మనము జ్ఞానముతో జీవించలేము. జ్ఞానము సంపాదించుకొనుటయే జ్ఞానమునకు ముఖ్యాంశము. నీ సంపాదన అంతయు ఇచ్చి బుద్ధి సంపాదించుకొనుము" (సామెతలు 4:15). దేవుడు జ్ఞానం లేనివారికి బుద్ధిని, యావనులకు తెలివిని, వివేచనను ఇవ్వాలని కోరుతున్నాడు (సామెతలు 1:4). మనం కనీస ఇంగిత జ్ఞానం కలిగి ఉండాలని కోరుతున్నాడు. ఈనాడు ఈలోకంలో అది కొరవడింది.

సామెతలు 4:23-26లో సర్వశరీరమును గూర్చి వ్రాయబడింది. హృదయాన్ని కాపాడుకోవాలి (23వ) మూర్ఖమైన, కుటిలమైన మాటలను మన నోటి నుండి రానియ్యవద్దు (24వ) కన్నులు సూటిగా చూడాలి. (25వ) నడిచే మార్గాన్ని సరాళం చేసికోవాలి (25వ).

ఇక క్రమశిక్షణ విషయానికొస్తే తల్లిదండ్రులు పిల్లల్ని క్రమశిక్షణ చెయ్యాలని ఖచ్చితంగా చెప్పబడినా, ఆ క్రమశిక్షణ, దేవుడు తన పిల్లలను శిక్షించినట్లుగా ఉండాలి (సామెతలు 3:11,12). అంత్య దినాలలో సంభవించబోయే (భ్రష్టత్వంలో తల్లిదండ్రులకు అవిధేయులగుట అన్నది ఒకటి (2తిమోతి 3:2). సామెతల గ్రంథంలో, యౌవనస్తులు చెడు సహసమును గూర్చి అలాగే అపవిత్రత, అసహనం, కోపం, పోట్లాటలను గూర్చి కూడ హెచ్చరించబడుతున్నారు (సామెతలు 1:10-19; 4:14-19 మరియు 3,10,13,15,16,18 అధ్యా).

నాలుకను భద్రం చేసికోవడం గూర్చి కూడ వ్రాయబడింది. మన నాలుకను ఇష్టానుసారంగా ఉపయోగిస్తాము. దానితో ఎన్నో పాపాలు చేస్తాము. జీవమరణాలు నాలుక వశంలోనే ఉన్నాయి గనుక దాన్ని జాగ్రత్తగా వాడుకోవాలి. (సామెతలు 12:22; 18:21). ఇవన్నీ కూడ దేవుని జ్ఞానమైన క్రీస్తు మనలో ఉంటేనే సాధ్యమౌతుంది.

**2. మానవులందరికి ఉపదేశం (11-20 అధ్యా). :**

ఈ భాగంలో తప్పుడు విధానంలో పొదుపు చేయడం (సామెతలు 11:24). అబద్దాలు చెప్పడం (సామెతలు 18:5). మాట్లాడే విధానం (సామెతలు 15:1). నడతలు (సామెతలు 16:2). స్నేహితులు (సామెతలు 18:24). త్రాగుడు (సామెతలు 20:1). నీతియుక్తమైన జీవితం (సామెతలు 20:7). పిల్లల పెంపకం (సామెతలు 22:6). మొదలైన వాటిని గూర్చి వ్రాయబడింది.

బైబిల్లో మద్యపానమును గూర్చి హెచ్చరించినంతగా మరే పాపమును గూర్చి హెచ్చరించబడలేదు. (సామెతలు 20,23,31 అధ్యా.; 1కొరింథీ 6:9,10). సామెతల గ్రంథంలోని మాటలన్నీ చిత్రమైన వెండి పళ్ళెములో నుంచబడిన బంగారు పండ్ల వంటివి (సామెతలు 25:11).

ఎలా చెయ్యాలో తెలియనిదే ఏ మనిషి కూడ ఏమి చేయలేడు. అయితే తమకివ్వబడిన సలహాలను, సూచనలను పూర్తిగా అనుసరించరు. పైగా చివరికి మాకు ఎవ్వరూ తగిన మంచి సలహా ఇవ్వలేదనివాపోతారు. ప్రియులారా! సామెతల గ్రంథం దేవుని చిత్తాన్ని దేవుని మార్గాన్ని తెలియజేస్తుంది. దాన్ని అనుసరిద్దాం. మేలు పొందుదాం.

**3. రాజులకు అధికారులకు ఉపదేశం (21-31 అధ్యా.) :**

ఈ భాగంలో రాజులు మరియు అధికారులకు ఉండాల్సిన లక్షణాలు వివరించబడ్డాయి. స్వయం నిగ్రహము (సామెతలు 21:28). పలుకుబడి (సామెతలు 22:1). సలహాలు (సామెతలు 24:6). స్త్రీలను గూర్చి (సామెతలు 25:24). చాడీలు (సామెతలు 26:20). వాయిదా వేయుట (సామెతలు 27:1). వివేకము (సామెతలు 28:16). లంచము (సామెతలు 29:4). భద్రత (సామెతలు 30:5) మొదలైన వాటిని గూర్చిన ఉపదేశాన్ని హెచ్చరికల్ని ఈ భాగంలో చూస్తాము.

**3. అంశాలవారిగా సంక్షిప్త వివరణ :**

**1. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సామెతలు :**

**1. మంచి పేరు :**

ప్రతివ్యక్తి జీవితం ఇతరులపై, సమాజంపై ప్రభావాన్ని చూపిస్తుంది. మంచి వ్యక్తుల పేరు చరిత్ర పుటలలో చేర్చబడతాయి. చిరస్మరణీయమవుతాయి. గొప్ప ఐశ్వర్యము కంటె మంచి పేరును... కోరదగినవి (సామెతలు 21:1). నీతిమంతుని జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరమగును" (సామెతలు 10:7).

**2. మంచి ప్రవర్తన :**

**2.1. ఇంద్రియ నిగ్రహం :**

తన్నుతాను నిగ్రహించుకొనే విధానంపై ఆ వ్యక్తి యొక్క ప్రవర్తన ఆధారపడి ఉంటుంది. ఈ నిగ్రహము పరిశుద్ధాత్మ ద్వారానే సాధ్యమైనా (2తిమోతి 1:7). ఆ వ్యక్తి ఆత్మ స్వాధీనంలోనికి వచ్చినప్పుడే, అట్టి శక్తిని పొందగలుగుతాడు. సామెతల గ్రంథం మనస్సును స్వాధీనపరచుకొనుటను గూర్చి (సామెతలు 16:32; 25:28) మరియు నోటిని అదుపులో ఉంచుకొనుటను గూర్చి (సామెతలు 13:3; 17:27,28; 18:21; 21:23), చూపు (సామెతలు 4:25), కోపము (సామెతలు 29:11), పాదాలను (సామెతలు 1:15; 4:27) అదుపులో ఉంచుకొనుటను గూర్చి మరియు ధనాపేక్షను అదుపులో ఉంచుకొనుటను గూర్చి (సామెతలు 28:4; 28:20) హెచ్చరిస్తుంది.

**2.2. దీర్ఘశాంతం :**

ఆత్మఫలంలో ఒకటైన దీర్ఘశాంతం దైవలక్షణం. దీర్ఘశాంతం అనేక నష్టాలను, ఉపద్రవాలను, ఉగ్రతను తప్పిస్తుంది. అందుకే దీర్ఘశాంతము గలవాడు మహావివేకిగా ఎంచబడుచున్నాడు (సామెతలు 14:29). అది సుబుద్ధి వలననే కలుగుతుంది (సామెతలు 19:11).

**3. మంచి మాటలు :**

పరస్పర అవగాహనకు మాటలే ముఖ్యము. మనం మాట్లాడే విధానాన్ని బట్టి ఇతరులు స్పందిస్తారు. మన మాటలు ఏలాంటి ప్రతిస్పందన నిస్తున్నాయో పరిశీలించుకోవాలి. మాటల చాతుర్యం (Communication Skills) జీవితంలో అన్ని రంగాలలోనూ అవసరం. కనుక ఇలాంటి నైపుణ్యత కొరకు అభ్యాసం చేద్దాం.

- నోటి ఫలము చేత మనుష్యుడు మేలు అనుభవించును (సామెతలు 13:2).
- నీతిమంతుని నాలుక ప్రశస్తమైన వెండి వంటిది (సామెతలు 10:20).
- ఇంపైన మాటలు తేనేపట్టు వంటివి. అవి ప్రాణమునకు మధురమైనవి, ఎముకలకు ఆరోగ్యకరమైనవి (సామెతలు 16:24).
- జ్ఞానుల నాలుక ఆరోగ్యదాయకము (సామెతలు 12:18).
- నీతిమంతుని పెదవులు అనేకులకు ఉపదేశించును (సామెతలు 11:21).
- జ్ఞానుల నాలుక మనోహరమైన జ్ఞానాంశములు పలుకును (సామెతలు 15:2).
- సాత్వికమైన నాలుక జీవవృక్షము (సామెతలు 15:4).
- సాత్వికమైన నాలుక ఎముకలను నలుగగొట్టును (సామెతలు 25:15).
- నీతిమంతుని మనస్సు యుక్తముగా ప్రత్యుత్తరమిచ్చుటకు ప్రయత్నించును (సామెతలు 15:20).
- సరిగా ప్రత్యుత్తరమిచ్చిన వానికి దాని వలన సంతోషము పుట్టును. సమయోచితమైన మాట ఎంత మనోహరము (సామెతలు 15:23).
- సమయోచితముగా పలుకబడిన మాట చిత్రమైన వెండి పళ్ళెములో నుంచబడిన బంగారు పండ్ల వంటిది (సామెతలు 25:11).
- మృదువైన మాట కోధమును చల్లార్చును (సామెతలు 15:1).

(తరువాయి 10వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

**4. మంచి స్నేహితులు :**

స్నేహమన్నది ఒక పారశాల వంటిది. అది ఒక వ్యక్తిని మంచివానిగానైన మారుస్తుంది లేక చెడ్డవానిగానైనా మారుస్తుంది. కనుక మనం ఎలాంటి వారితో స్నేహం చెయ్యాలో తెలిసికోవడం అవసరం. మంచి స్నేహం గొప్ప లాభదాయకం.

– జ్ఞానుల సహవాసం చేయువాడు జ్ఞానము గలవాడగును (సామెతలు 13:20).

– ఇనుముచేత ఇనుము పదునగును, అట్లు ఒకడు తన చెలికానికి వివేకము పుట్టించును (సామెతలు 27:17).

– చెలికాని హృదయములో నుండి వచ్చు మధురమైన మాటలు హృదయమును సంతోషపరచును (సామెతలు 27:9).

– ఆరోగ్యం, ఐశ్వర్యం ఉన్నప్పుడు మనల్ని ఆశ్రయించి, అవి విడచిపోగానే మనల్ని విడచిపోయేవారు నిజమైన స్నేహితులు కారు. “నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించును. దుర్దశలో అట్టివాడు సహోదరుడుగా నుండును” (సామెతలు 17:17).

– “సహోదరుని కంటెను ఎక్కువగా హత్తియుండు స్నేహితుడు కలడు” (సామెతలు 18:24).

– మంచి స్నేహితుడు మన క్షేమాన్ని కోరతాడు. కనుక మన లోపాలను సరిచేస్తాడు. తప్పు చేసినప్పుడు గద్దిస్తాడు. అవి మనకు బాధ కలిగించినా, అది మన మేలు కొరకేనని గ్రహించాలి.

– “మేలును కోరి స్నేహితుడు గాయములు చేయును” (సామెతలు 27:6). అందరికన్న మంచి స్నేహితుడైన యేసుక్రీస్తును (యోహాను 15:13-15) రక్షకునిగా అంగీకరించినవారు మంచి స్నేహితుల సహవాసాన్నే కోరుతారు.

**5. మంచి పనితనము :**

ఈ లోకములో పుట్టిన ప్రతి వ్యక్తి తన జీవనోపాధి కోసం తప్పనిసరిగా పనిచెయ్యాలి. ఒకని ఆకలి వానిచేతకష్టము చేయిస్తుంది (సామెతలు 16:26).

పని అన్నది మనిషి జీవించడానికి దేవుడు చేసిన ఏర్పాటు. పనిచేయనిదే భోజనము చేయకూడదని దేవుని నియమం (సామెతలు 31:27; 2థెస్స 3:10). కనుక సోమరిగా ఉండడంకన్న జీవనోపాధి కోసం ఏ పనినైనా చేయవచ్చును (సామెతలు 14:23). కష్టజీవికి సమృద్ధిగా ఆహారం లభిస్తుంది (సామెతలు 12:11). మనం చేసే పనులలో చురుకుదనం ఉండాలి. దానిని ఒక బరువైన బాధ్యతగా భావించక దేవునిచే ఇవ్వబడిన ఒక ఆధిక్యతగా భావించాలి. చురుకుగా ఉండడం గొప్ప భాగ్యం (సామెతలు 12:27). అది మనకు, మన కుటుంబాలకు లాభం చేకూరుస్తుంది. (సామెతలు 31:17-25; 31:11). పనిలో జాగుచేస్తే నష్టానికి కారణమౌతుంది (సామెతలు 18:9). దేవుడు నీకు ఇచ్చిన పనిని శ్రద్ధగా చేస్తే గొప్పమేలు పొందుతావు.

– శ్రద్ధగలవారి ప్రాణము పుష్టిగానుండును (సామెతలు 13:4).

– శ్రద్ధగలవాడు ఐశ్వర్యవంతుడగును (సామెతలు 10:4).

– శ్రద్ధగా పనిచేయువారు ఏలుబడి చేయుదురు (సామెతలు 12:24). అంతమాత్రమే కాదు పనిలో నమ్మకత్వం కూడా ఉండాలి. అది అన్నిటికన్న ప్రాముఖ్యమైనది.

– “నమ్మకమైనవానికి దీవెనలు మెండుగా కలుగును” (సామెతలు 28:20). అలా క్రమేణ ఆ పనిలో నైపుణ్యతను సాధించి, గొప్పవారి యెదుట ఘనత పొందగలుగుతావు (సామెతలు 22:29).

**6. మంచి సంపాదన :**

ఒక వ్యక్తి ఎంత సంపాదిస్తున్నాడనే దానికన్నా ఎలా సంపాదిస్తున్నాడన్నది ముఖ్యం. “న్యాయవిరోధముగా ఆస్తి సంపాదించుకొనువాడు తాను పెట్టని గుడ్లను పొదుగు కౌజు పిట్టవలె నున్నాడు. సగము ప్రాయములో వాడు దానిని విడువ వలసి వచ్చును” (యిర్మియా 17:11) అని బైబిలు స్పష్టంగా చెప్తుంది. సామెతల గ్రంథం దీనిని నొక్కివక్కాణిస్తుంది.

– మోసము చేత సంపాదించిన ధనము క్షీణించిపోవును. కష్టముచేసి కూర్చుకొనువాడు తన ఆస్తిని వృద్ధిచేసికొనును (సామెతలు 13:11).

– అన్యాయము చేత కలిగిన గొప్ప వచ్చుబడికంటే నీతితో కూడిన కొంచెమే శ్రేష్ఠము (సామెతలు 16:8). కష్టపడి సంపాదించినా, దేవుని ఆశీర్వాదం లేకుంటే ఒక వ్యక్తి, ఐశ్వర్యవంతుడు కాలేడు. నిజమైన సంతోషము, సంతృప్తి ఉండదు.

– “యెహోవా ఆశీర్వాదము ఐశ్వర్యమిచ్చును”, నరుల కష్టముచేత ఆయాశీర్వాదము ఎక్కువకాదు (సామెతలు 10:22).

– “నెమ్మది లేకుండ విస్తారమైన ధనముండుట కంటె, యెహోవా యందలి భయభక్తులతో కూడ కొంచెము కలిగియుండుట మేలు” (సామెతలు 15:16).

**2. కుటుంబ జీవితానికి సంబంధించిన సామెతలు :**

దేవుడు చేసిన మొదటి వ్యవస్థ కుటుంబం. కుటుంబాలు బాగుంటే, సమాజం బాగుంటుంది. దేశం బాగుంటుంది. కుటుంబాలు ఈ లోకంలో, పరలోకానికి ప్రతీకగా ఉండాలని దేవుని ప్రణాళిక. క్రీస్తుకు సంఘానికి మరియు క్రీస్తుకు విశ్వాసికి గల సంబంధానికి ప్రతి రూపంగా కుటుంబమున్నది. కుటుంబములో భార్యభర్తల నంబంధాలు క్రీస్తుకు మరియు సంఘమునకుగల సంబంధమువలె, అలాగే తల్లిదండ్రులకు మరియు పిల్లలకు మధ్యగల సంబంధం విశ్వాసికి క్రీస్తుతో గల సంబంధంవలె ఉండాలి. అందుకు ఉండవలసిన నైతిక ప్రమాణాలను గూర్చి, దైవిక క్రమశిక్షణను గూర్చి, దైవిక ఉపదేశమును గూర్చి సామెతల గ్రంథం వివరిస్తుంది.

కుటుంబ జీవితంలో వైఫల్యతను గూర్చి తీవ్రమైన హెచ్చరికలు చేయబడ్డాయి. ‘‘తన యింటివారిని బాధపెట్టువాడు గాలిని స్వతంత్రించుకొనును” (సామెతలు 11:29). “తన యిల్లు విడిచి తిరుగువాడు గూడు విడిచి తిరుగు పక్షితో సమానుడు” (సామెతలు 27:8), దీనిని బట్టి చూస్తే దేవుడు కుటుంబాలకు ఎంత ప్రాధాన్యతనిస్తున్నాడో అర్ధమౌతుంది.



# గొప్ప జ్ఞానము

**(సామెతల గ్రంథం సంగ్రహ సమీక్ష)**

**1. సద్భక్తి :**

దేవునియందు భయభక్తులు గలిగియుండుట ద్వారానే కుటుంబాలు దీవించబడతాయని స్పష్టమౌతుంది.

– భక్తిహీనులు పాడైపోవుదురు. నీతిమంతుల యిల్లు నిలుచును (సామెతలు 12:76).

– 28 హీనుల యిల్లు నిర్మూలమగును, యథార్ధవంతుల గుడారము వర్ధిల్లును (సామెతలు 14:11).

– నీతిమంతుల సంతానము విడిపింపబడును (సామెతలు 11:21).

– యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట బహుధైర్యము పుట్టించును. అట్టివారి పిల్లలకు ఆశ్రయస్థానము కలదు (సామెతలు 14:26).

– నీతిమంతుని యిల్లు గొప్ప ధననిధి (సామెతలు 15:6).

– భార్య దొరికిన వానికి మేలు దొరికెను. అట్టివాడు యెహోవా వలన అనుగ్రహము పొందినవాడు (సామెతలు 18:22).

**2. సత్సంబంధాలు :**

భార్యాభర్తలకు మరియు తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య సత్సంబంధాలుండాలంటే మొదట నమ్మకత్వం అవసరం. భర్త భార్యపట్ల, భార్య భర్తపట్ల శరీరసబంధాల విషయంలోను, బాధ్యతల విషయంలోను నమ్మకంగా ఉండాలి (సామెతలు 6:27-35; 31:11).

**3. సంతుష్టి :**

భార్యాభర్తల మధ్య సత్సంబంధాలుంటే ఒకరి వలన మరొకరు సంతుష్టి చెందగలుగుతారు (సామెతలు 5:15-20).

**4. సమాధానం :**

ఎన్ని ఉన్నా ఎంత సంపాదించినా కుటుంబంలో సమాధానం లేనట్లైతే అంతకన్న దౌర్భాగ్యస్థితి మరొకటిలేదు. ‘‘రుచికరమైన భోజనపదార్ధములున్నను. కలహముతో కూడి యుండిన ఇంటనుండుట కంటె, నెమ్మది కలిగియుండి రొట్టెముక్క తినుటమేలు” (సామెతలు 17:1; 25:24). ఒకరినాకరు ప్రేమించి, క్షమించి ఎవరి తప్పులు వారు సరిచేసుకొంటె సమాధానబంధాన్ని కాపాడుకోవచ్చును. “నీతిమంతుడు ఏడు మారులు పడినను తిరిగిలేచును” (సామెతలు 26:16).

**5. సంతోషం :**

వస్తువాహనాలు, ఐశ్వర్య ఘనతల వలన కుటుంబంలో నిజమైన సంతోషం లభించదు. కుటుంబంలోని ప్రతివ్యక్తి దైవభక్తి గలిగి సౌశీల్యత, సత్ప్రవర్తన కలిగివున్నప్పుడే కుటుంబం సంతోషంగా ఉంటుంది. “నెమ్మది లేకుండ విస్తారమైన ధనముండుట కంటె, యెహోవాయందలి భయభక్తులతో కూడా కొంచెము కలిగియుండుటమేలు” (సామెతలు 15:16). భర్తను బట్టి భార్యకు, భార్యనుబట్టి భర్తకు, తల్లిదండ్రులను బట్టి పిల్లలకు, పిల్లలను బట్టి తల్లిదండ్రులకు సంతోషం కలగాలి.

1. “ఆమె పెనిమిటి దేశపు పెద్దలతో కూడ కూర్చుందును, గవినియొద్ద పేరుగొనినవాడై యుండును” (సామెతలు 31:23).

2. “ఆమె కుమారులు లేచి ఆమెను ధన్యురాలందురు, చాలా మంది కుమార్తెలు పతివ్రతా ధర్మమునునుసరించి యున్నారు గాని, వారందరిని నీవు మించినదానవు అని ఆమె పెనిమిటి ఆమెను పొగడును” (సామెతలు 31:28,29; 19:14; 12:4).

3. నీ తల్లిదండ్రులను నీవు సంతోష పెట్టవలెను. నిన్ను కనిన తల్లిని ఆనందపరచవలెను (సామెతలు 23:25; 15:20; 17:21,25; 23:24).

**6. సమృద్ధి :**

కుటుంబంలో సమృద్ధి కుటుంబ యజమాని కష్టార్జితంపై ఆధారపడి ఉంటుంది.

1. “తన భూమిని సేద్యపరచుకొనువానికి ఆహారము సమృద్ధిగ కలుగును” (సామెతలు 12:11; 27:23-27; 28:19).

2. “జ్ఞానము వలన ఇల్లు కట్టబడును, వివేచన వలన అది సిరపరచబడును. తెలివిచేత దాని గదులు విలువ గల రమ్యమైన సర్వసంపదలతో నింపబడును” (సామెతలు 24:3; 31:11,21,22). దేవుడు ఇచ్చిన సంపదలను సద్వినియోగం చేసుకోగల దైవజ్ఞానం కుటుంబములో ఎంతైనా అవసరం.

3. “విలువగల ధనమును నూనెయు జ్ఞానుల యింట నుండును. బుద్ధిగలవాడు దానిని వ్యయపరచును” (సామెతలు 21:20).

4. “సుఖభోగములయందు వాంఛగలవానికి లేమి కలుగును, ద్రాక్షారసమును నూనెయు వాంఛించువానికి ఐశ్వర్యము కలుగదు” (సామెతలు 21:17).

**7. సద్బోధ :**

దైవభక్తిగల కుటుంబాలలో దైవోపదేశం తప్పనిసరిగా ఉండాలన్నది దేవుని ఆజ్ఞ (ద్వితీ 6:4-9). సామెతల గ్రంథం కూడా దానిని నొక్కి వక్కాణిస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు దేవున్ని ఆశ్రయించడానికి మరియు వారికి సత్యప్రమాణమును తెలియజేయడానికి ఉపదేశం చేయాలి (సామెతలు 22:6, 19-21; 31:1,26). పిల్లలు తల్లిదండ్రుల ఉపదేశాన్ని వినాలి.

“నా కుమారుడా నీ తండ్రి ఉపదేశమును ఆలకింపుము నీ తల్లి చెప్పు బోధను త్రోసివేయకుము” (సామెతలు1:8; 23:22). తల్లిదండ్రుల బోధ అంగీకరించినవారు బుద్ధిగలవారు (సామెతలు 15:5; 28:7), లోబడనివాడు నాశనమౌతాడు (సామెతలు 29:1).

**8. శిక్షణ :**

కుటుంబంములో ఉపదేశముతో పాటు క్రమశిక్షణ కూడా అవసరం. పిల్లలలో సయితం స్వాభావికముగా పాపం ఉంటుంది. “బాలుని హృదయములో మూఢత్వము స్వాభావికముగా పుట్టును. శిక్షాదండము దానిని వానిలో నుండి తోలివేయును” (సామెతలు 22:15; ఆది 8:21; కీర్తనలు 51:5). పిల్లల వైఖరిని గమనిస్తు వారు మొక్కగా ఉన్నప్పుడే శిక్షించి సరిచేయనట్లైతే కుటుంబానికి మరియు సమాజానికి హానికరమైన వ్యక్తులుగా తయారవుతారు.

“తండ్రి శిక్షించిన కుమారుడు జ్ఞానము గలవాడగును” (సామెతలు 13:1). “బెత్తము వాడని వాడు తన కుమారునికి విరోధి. కుమారుని ప్రేమించువాడు వానిని శిక్షించును” (సామెతలు 13:24). “బుద్ధి వచ్చునని నీ కుమారుని శిక్షింపుము అయితే వాడు చావవలెనని కోరవద్దు” (సామెతలు 19:18).

**శిక్షణ వలన కలిగేమేలు :**

“గాయములు చేయు దెబ్బలు అంతరంగములో చొచ్చి చెడుతనమును తొలగించును” (సామెతలు 20:30). “నీ బాలురను శిక్షించుట మానకుము. బెత్తముతో వాని కొట్టిన యెడల వాడు చావకుండును. బెత్తముతో వాని కొట్టిన యెడల పాతాళమునకు పోకుండ వాని ఆత్మను నీవు తప్పించెదవు” (సామెతలు 23:13,14). “నీ కుమారుని శిక్షించిన యెడల అతడు నిన్ను సంతోషపరచును. నీ మనస్సునకు ఆనందము కలుగజేయును” (సామెతలు 29:17).

**9. సదుపాయము :**

దేవునియందు సద్భక్తి గలిగి, సక్రమ కష్టార్జితములో దేవునికి ఇచ్చిన వారికి సమృద్ధి ఉంటుంది. “నీ రాబడి అంతటిలో ప్రథమ ఫలమును, నీ ఆస్తిలో భాగమును ఇచ్చి యెహోవాను ఘనపరచుము. అప్పుడు నీ కొట్లలో ధాన్యము సమృద్ధిగానుండును, నీ గానుగలలో నుండి కొత్త ద్రాక్షారసము పైకి పొరలి పారును” (సామెతలు 3:9,10). దానిని సరైన విధంగా వినియోగించినవారు, తమ మట్టుకే గాక, వారి తదనంతరం వారి పిల్లల్ని ఆస్తికర్తలుగా చేస్తారు (సామెతలు 13:22).

**3. సామాజిక జీవితమును గూర్చిన సామెతలు :**

మనిషి సంఘజీవి, సమాజంలో ఇతర వ్యక్తులు మనకు ఎంత అవసరమో, మనము కూడా వారికి అంతే అవసరం. ఒకరితో మరొకరు సంబంధం లేకుండ ఈ లోకంలో జీవించడం కష్టం. కలిసి జీవించడంలో కూడా ఎన్నో కష్టాలుంటాయి. అయితే అందరితో ప్రేమకలిగి వారికి ఆశీర్వాదకరంగా జీవించాలన్నదే దేవుని ఉద్దేశం. అందుకే మనల్ని ఇంకా ఈ లోకంలో ఉంచాడు.

**1. పరస్పర సంబంధం :**

పొరుగువారిని గౌరవించాల్సిన విధానాన్ని గూర్చి సామెతల గ్రంథం హెచ్చరిస్తున్నది. “తన పొరుగువానిని తృణీకరించువాడు బుద్ధిలేనివాడు” (సామెతలు 11:12). “తన పొరుగువానిని తిరస్కరించువాడు పాపము చేయువాడు” (సామెతలు 14:21). వారు ఎలాంటి వారైనా మన ప్రవర్తన యథార్ధంగా వుంటే శత్రువులు సహా మిత్రులుగా మారతారు (సామెతలు 16:7) మనలో దేవుని ప్రేమను చూడగలుగుతారు.

**2. పరస్పర సమాధానం :**

తరచుగా సమాధానానికి భంగం కలిగించేవి కలహాలు, జగడాలు. అవి చిన్న చిన్నవే అయినా పరస్పర సంబంధాలకు ముప్పుకలిగిస్తాయి. గనుక వాటి విషయం జాగ్రత్తగా ఉండాలి. “నీకు హాని చేయని వానితో నిర్నిమిత్తముగా జగడమాడవద్దు” (సామెతలు 3:30). “కలహమునకు దూరముగా నుండుట నరులకు ఘనత. మూర్ఖుడైన ప్రతివాడు పోరునే కోరును” (సామెతలు 20:3). “ఆలోచన లేక వ్యాజ్యెమాడుటకు పోకుము” (సామెతలు 25:8). “తనకు పట్టని జగడమును బట్టి రేగువాడు దారినపోవుచున్న కుక్క చెవులు పట్టుకొనువానితో సమానుడు” (సామెతలు 26:17).

**3. పరస్పర సహాయము :**

ఒకరికొరకు మరొకరు ప్రార్థిస్తూ, ఒకరి భారాలు మరొకరు మోయడం సంఘ, లేక సమాజ జీవితానికి దేవుడిచ్చిన నియమం. “ఈలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి” (గలతీ 6:2) అని పౌలు సంఘాలకు హెచ్చరించాడు. “మేలు చేయుట నీ చేతనైనప్పుడు దాని పొందదగినవారికి చేయకుండ వెనుకతియ్యకుము” (సామెతలు 3:27). మేలు చేయలేకపోతే పర్వాలేదుగాని కీడు తలపెట్టవద్దు సుమా!

“నీ పొరుగువాడు నీ యొద్ద నిర్భయముగా నివసించునప్పుడు వానికి అపకారము కల్పింపవద్దు” (సామెతలు 3:29).

“భక్తిహీనుడు తన నోటిమాటచేత తన పొరుగువారికి నాశనము తెప్పించును” (సామెతలు 11:9).

“యథార్థవంతులు ఒకరియందు ఒకరు దయ చూపుదురు” (సామెతలు 14:9).

“కృప చూపుట నరుని పరులకు (తరువాయి 11వ పేజీలో)

(10వ పేజీ తరువాయి) ప్రియునిగా చేయును" (సామెతలు 19:22).

"నీతిమంతుడు తన పొరుగువానికి దారిచూపును, భక్తిహీనుల ప్రవర్తన వారిని దారి తప్పించును" (సామెతలు 12:26).

"జ్ఞానముగలవారు ఇతరులను రక్షించుదురు (సామెతలు 11:30).

మనం ఇతరులకు దారి చూపిస్తున్నామా? వారి రక్షణను గూర్చి భారం ఉందా. మన ప్రవర్తన ఇతరులు రక్షించబడడానికి కారణమౌతున్నదా?

"చావునకై పట్టబడినవారిని నీవు తప్పించుము, నాశనమునందు పడుటకు జోగుచున్న వారిని నీవు రక్షింపవా? (సామెతలు 24:11).

**4. పరస్పర సహకారం :**

పొందిన దానితో తృప్తిచెంది కలిగిన దానిని ఇతరులతో పంచుకోవడమే. ఔదార్యం. ఇది క్రీస్తును అంగీకరించిన ప్రతి విశ్వాసి కలిగి ఉండాల్సిన లక్షణం (సామెతలు 22:9; 14:21; 14:31; 19:17; 11:24,25).

**ఔదార్యమునకు మచ్చుతునక యేసుక్రీస్తే :**

"మీరు మన ప్రభువైన యేసుక్రీసు కృపను ఎరుగుదురు గదా! ఆయన ధనవంతుడైయుండియు, మీరు తన దారిద్ర్యమువలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2కొరింథీ 8:9). ఔదార్యం, విశ్వాసులకు, సంఘములకు అనుగ్రహింపబడిన దేవుని కృప (2కొరింథీ 8:1). ఈ కృపలో మనం అభివృద్ధి చెందాలి (2కొరింథీ 8:7).

**5. పరస్పర విధేయత :**

సామాజిక జీవితంలో వుండే మరో ప్రాముఖ్యమైన విషయం అధికారులకు మరియు పనివారికి, యజమానులకు మరియు దాసులకు మధ్యగల సంబంధాలు. వాటిని కూడా కాపాడుకోవాలి. అందుకు యజమానులు దాసులు కలిగి ఉండాల్సిన లక్షణాలను చూద్దాం.

**1. సేవకులు :**

"బుద్ధిగల సేవకుడు రాజులకిష్టుడు. అవమానకరముగా నడుచువాని మీద రాజు కోపించును" (సామెతలు 14:35).

"నా కుమారుడా యెహోవాను ఘనపరచుము, రాజును ఘనపరచుము. అలాగు చేయనివారి జోలికి పోకుము" (సామెతలు 24:21).

"నమ్మకమైన దూత తనను పంపువారికి కోతకాలపు మంచు చల్లదనము వంటివాడు. వాడు తన యజమానుల హృదయమును తెప్పరిల్లజేయును" (సామెతలు 25:18).

"తన యజమానుని మన్నించువాడు ఘనత నొందును" (సామెతలు 27:18).

**2. అధికారులు :**

"జ్ఞానముగల రాజు భక్తిహీనులను చెదరగొట్టును" (సామెతలు 20:26).

"అధికారులు న్యాయమును బట్టి పాలన చేయుదురు" (సామెతలు 8:15).

"అబద్ధమాడుట అధిపతికి (తరువాయి 11వ పేజీలో)

(10వ పేజీ తరువాయి) బొత్తిగా తగదు" (సామెతలు 17:7).

"న్యాయము జరిగించుట వలన రాజు దేశమునకు క్షేమము కలుగజేయును" (సామెతలు 29:4).

"అనేకులు ఏలువాని దయ కోరుచుందురు" (సామెతలు 29:26).

**4. ప్రత్యేక హెచ్చరికలు :**

**1. నైతిక జీవితమును గూర్చి :**

**1.** అక్రమ సంబంధాలు (సామెతలు 2:6-20; 5:3-14; 6:24-35; 7:5-21). వాని వలన కలిగే నష్టాలు (సామెతలు 6:33; 7:26,27; 22:14; 23:27; 28:3; 31:3). తప్పించుకొనే మార్గం (7:1-5).

**2.** అక్రమ సంపాదనను గూర్చి (సామెతలు 15:8; 16:19; 20:17; 21:6; 22:16,22; 28:6,8). "దుర్లాభమును ద్వేషించువాడు దీర్ఘాయుష్మంతుడగును" (సామెతలు 28:16).

**3.** అన్యాయ తీర్పును గూర్చి (సామెతలు 24:23,24; 28:5,21). "న్యాయముగా తీర్పు తీర్చువారికి మేలు కలుగును" (సామెతలు 24:25; 29:7; 31:8,9).

**2. లంచమును గూర్చి :** (సామెతలు 15:27; 17:8,23; 28:8; 29:4).

**3. వర్తకమును గూర్చి :** (సామెతలు 11:1; 16:11; 20:10,23).

**4. సోమరితనమును గూర్చి :**

వ్యక్తిగతముగా కలిగే నష్టం (సామెతలు 6:4-11; 10:4,5; 12:27; 13:4; 19:15; 20:4; 21:25; 24:33,34).

ఇతరులకు కలిగే నష్టం (సామెతలు 10:26; 18:9).

**5. చెడు స్నేహమును గూర్చి :**

పాపులతో భక్తిహీనులతో స్నేహం చేయవద్దు (సామెతలు 1:10-19; 4:14-17).

- బుద్ధిహీనునితో స్నేహం చేయవద్దు (సామెతలు 14:7).
- కోపచిత్తునితో సహవాసం చేయవద్దు (సామెతలు 22:24).
- ఇతరులతో పూటబడువారితో చేరవద్దు (సామెతలు 22:26). తిండిబోతులు, త్రాగుబోతులతో స్నేహం చేయవద్దు.

**6. కొండెములను గూర్చి :** (సామెతలు 10:18; 11:13; 16:28; 20:19; 26:20).

**5. దేని కంటే ఏది శ్రేష్టము? ఏది మేలు :**

1. వంచకుడై ధనము సంపాదించిన వాని కంటె యథార్థముగా ప్రవర్తించు దరిద్రుడు వాసి (సామెతలు 28:6).

2. నెమ్మది లేకుండా విస్తారమైన ధనముండుట కంటే దేవునియందు భయభక్తులతో కొంచెం కలిగి ఉండుట మేలు (సామెతలు 15:16).

3. గొప్ప ఐశ్వర్యం కంటె మంచి పేరు, వెండి బంగారములు కంటె దయ కోరదగినవి (సామెతలు 22:1).

4. అన్యాయపు అధిక సంపాదన కంటే నీతి న్యాయాలతో కొంచెం శ్రేష్టము (సామెతలు 16:8).

5. వెండి బంగారాల సంపాదనకంటే తెలివి జ్ఞానముల సంపాదన



# గొప్ప జ్ఞానము

**(సామెతల గ్రంథం సంగ్రహ సమీక్ష)**

శ్రేష్టము (సామెతలు 16:16).

6. పగవాని ఇంట మాంసాహారం కంటే ప్రేమగల ఇంట శాఖాహారం మేలు (సామెతలు 15:17).

7. కలహంతో కూడిన రుచికరమైన భోజనం తినుట కంటే నెమ్మది కలిగి పట్టి రొట్టె ముక్క తినుట మేలు (సామెతలు 17:1).

8. గర్విష్టులతో దోపుడు సొమ్ము పంచుకొనుట కంటే దీన మనస్సు కలిగి దీనులతో పొత్తు కలిగి ఉండుట మేలు (సామెతలు 16:19).

9. పరాక్రమ శాలికంటె దీర్ఘశాంతము కలిగి ఉండువాడు, పట్టణము పట్టుకొనుటకంటె తన మనస్సును స్వాధీనపరచుకొనువాడు శ్రేష్టుడు (సామెతలు 16:32).

10. పెదవులతో మూర్ఖముగా మాటలాడువాని కంటె నిందారహితముగా నడుచుకొను ఒక పేదవాడు శ్రేష్టుడు (సామెతలు 19:1).

11. గయ్యాళితో పెద్ద ఇంట్లో కాపురం ఉండే కంటే మిద్దె మీద ఒక మూల నివసించుట మేలు (సామెతలు 21:9; 25:24).

12. లోలోపల ప్రేమించుట కంటే బహిరంగముగా గద్దించుట మేలు (సామెతలు 27:5).

**6. ప్రాముఖ్యమైన అధ్యాయాలు :**

**1. 25-27 అధ్యాయాలు - అలంకార రూపకములు :**

ఈ రెండు అధ్యాయాలలోను కొన్ని విషయాలను మరొకదానితో పోల్చి చెప్పడం గమనార్హం. అలంకారరూపముగా చెప్పబడిన ఈ సామెతలను. అర్థం చేసుకొంటె దాని వలన కలిగే లాభనష్టాలను అంచనా వేసుకోవచ్చును (సామెతలు 25:11-14,18-20,25,28; 26:2,6-9,11,17-19,33; 27:8,9,15,17,19,21).

**2. 30వ అధ్యాయం - ప్రసిద్ధమైన అంశాలు :**

1. యెహోవాకు అసహ్యములైనవి ఆరుగలవు. ఏడును ఆయనకు హేయములు (సామెతలు 6:16-19).

2. తృప్తిపడనివి మూడుకలవు - చాలును అని పలుకనివి నాలుగు కలవు (సామెతలు 30:15,16).

3. బుద్ధికి మించినవి మూడు గలవు - గ్రహింపలేనివి నాలుగు కలవు (సామెతలు 30:18,19).

4. భూమిని వణికించునవి మూడు కలవు - అది మోయలేనివి నాలుగు కలవు (సామెతలు 30:21-23).

5. చిన్నవైనా మిక్కిలి జ్ఞానము గల 4 జీవులు (సామెతలు 30:24-28).

6. దంబముగా నడుచునవి మూడు కలవు - ఠీవితో నడుచునవి నాలుగు కలవు (సామెతలు 30:29-31).

7. రెండు మనవులు (సామెతలు 30:7-9).

8. నాలుగు దుష్టతరములు :

1. తమ తండ్రిని శపించుచు తల్లిని దీవించని తరము (సామెతలు 30:11).

2. తమ దృష్టికి తాము శుద్ధులై, తమ మాలిన్యమునుండి కడుగబడని వారి తరము (సామెతలు 30:12).

3. కన్నులు నెత్తికి వచ్చినవారి తరము (సామెతలు 30:13).

4. దరిద్రులను మ్రింగేవారి తరము (సామెతలు 30:14).

**3. 31వ అధ్యాయం - రాజులు మరియు గుణవతియైన భార్య లక్షణాలు :**

**1. రాజుల లక్షణాలు (సామెతలు 31:1-9) :**

"నీ బలమును స్త్రీలకియ్యకుము, రాజులను నశింపజేయు స్త్రీలతో సహవాసము చేయకుము" (సామెతలు 31:8).

"ద్రాక్షారసము త్రాగుట రాజులకు తగదు" (సామెతలు 31:4).

"నీ నోరు తెరచి న్యాయముగా తీర్పు తీర్చుము. దీనులకును శ్రమపడువారికిని దరిద్రులకును న్యాయము జరిగింపుము" (సామెతలు 31:9).

**2. గుణవతియైన భార్య లక్షణాలు (సామెతలు 31:10-31) :**

"ఆమె పెనిమిటి ఆమెయందు నమ్మికయుంచును" (సామెతలు 31:11).

"ఆమె తానుబ్రదుకుదినములన్నియు అతనికి మేలు చేయునుగాని కీడేమియు చేయదు" (సామెతలు 31:12).

"తన చేతులారా పనిచేయును" (సామెతలు 31:13-15,17).

"దవ్యమును కూడ బెట్టును" (సామెతలు 31:16). "సమస్తము సమకూర్చును" (సామెతలు 31:21,22,25).

"దీనులకు తన చెయ్యి చాపును" (సామెతలు 31:20).

"వ్యాపార లాభము అనుభవముచే తెలిసికొనును" (సామెతలు 31:17,24,25).

"ఆమె పెనిమిటి పేరుగొనిన వాడైయుండును" (సామెతలు 31:28).

"జ్ఞానము కలిగి తన నోరు తెరచును కృపగల ఉపదేశము ఆమె బోధించును" (సామెతలు 31:26).

"తన యింటివారి నడతలను బాగుగా కని పెట్టును" (సామెతలు 31:27).

"పతివ్రతాధర్మము గలది" (సామెతలు 31:29).

"పిల్లల చేత భర్తచేత ఇతరుల చేత పొగడబడుతుంది" (సామెతలు 31:28,29,31).

"యెహోవాయందు భయభక్తులుగల స్త్రీ" (సామెతలు 31:30).

**7. విరుద్ధమైన విషయాలు :**

**1. నీతిమంతులు - భక్తిహీనులు :**

మార్గము అంతకంతకు తేజరిల్లును - (మార్గము) గాఢాంధకారమయం (సామెతలు 4:18,19).

ఆశ సంతోషం పుట్టించును - (ఆశ) భంగమైపోవును (సామెతలు 10:28).

పేరు జ్ఞాపకం చేసుకొనుట ఆశీర్వాదకరం - (పేరు) అసహ్యత పుట్టించును (సామెతలు 10:7).

నోరు జీవపు ఊట - (నోరు) బలత్కారం మరుగు పరచును (సామెతలు 10:11,31,39).

నోరు జ్ఞానోపదేశం పలుకును - (నోరు) మూర్ఖపు మాటలు పలుకును (సామెతలు 10:31,32).

కోరిక ఉత్తమమైనది - (కోరిక) అహంకార యుక్తమైనది (సామెతలు 11:23).

తలంపులు న్యాయయుక్తములు - (తలంపులు) మోసకరములు (సామెతలు 12:5).

ఇల్లు నిలుచును - (ఇల్లు) నిర్మూలమగును (సామెతలు 12:7; 14:11).

దీపం తేజరిల్లును - (దీపం) ఆరిపోవును (సామెతలు 13:9).

ఆకలితీర భోజనం చేయును - కడుపునకు లేమికల్గును (సామెతలు 13:25).

పాలన ప్రజలకు సంతోషం - (పాలన) ప్రజలకు నిట్టూర్పు (సామెతలు 29:2).

**2. జ్ఞానవంతులు - మూఢులు :**

జ్ఞానముగలవాడు - అపహాసకుడు (సామెతలు 9:7-9).

జ్ఞానముగల కుమారుడు - బుద్ధిలేని కుమారుడు (సామెతలు 10:1; 15:20).

జ్ఞానుల సహవాసం - మూర్ఖుల సహవాసం (సామెతలు 13:20).

జ్ఞానవంతురాలు - మూఢురాలు (సామెతలు 14:1).

జ్ఞానుల నాలుక - బుద్ధిహీనుని నోరు (సామెతలు 15:2).

జ్ఞానముగలవాని కోపము - బుద్ధిహీనుని కోపము (సామెతలు 29:11).

తెలివిగలవాని హృదయం - బుద్ధిహీనుని హృదయం (సామెతలు 14:33).

**3. ఇతరులు :**

శ్రద్ధగలవాడు - బద్ధకస్తుడు (సామెతలు 10:4).

దైవభక్తిగలవాని - భక్తిహీనుని ఆయుష్షు (సామెతలు 10:27).

నిజమాడు పెదవులు - అబద్ధమాడు నాలుక (సామెతలు 12:9).

కల్పించువారు - సమాధానపరచువారు (సామెతలు 12:20).

వివేకి విద్య - అవివేకి విద్య (సామెతలు 12:33).

మంచివాని ఆస్తి - పాపాత్ముల ఆస్తి (సామెతలు 13:22).

నమ్మకమైన సాక్షి - కూట సాక్షి (సామెతలు 14:5).

దీర్ఘశాంతం గలవాడు - ముంగోపి (సామెతలు 14:29; 15:18).

సాత్వికము - మత్సరము (సామెతలు 14:30).

మృదువైనమాట - నొప్పించుమాట (సామెతలు 15:20).

బాధపడువాడు - సంతోష హృదయుడు (సామెతలు 15:15).

దరిద్రుడు - ధనవంతుడు (సామెతలు 18:23).

శ్రద్ధగలవాడు - తాలిమిలేనివాడు (సామెతలు 21:5).

యెహోవాయందు నమ్మకముంచువాడు - తన మనస్సును నమ్ముకొనువాడు (సామెతలు 28:25,26).

గర్విష్ఠి - వినయ మనస్కుడు (సామెతలు 29:23).

**సామెతల గ్రంథము నుండి క్రొత్త నిబంధనలో పేర్కొన్న మాటలు :**

"నా కుమారుడా యెహోవా శిక్షను తృణీకరింపవద్దు ఆయన గద్దింపునకు విసుకవద్దు. తండ్రి తనకు ఇష్టుడైన కుమారుని గద్దించురీతిగా యెహోవా తాను ప్రేమించువారిని గద్దించును" (సామెతలు 3:11 - హెబ్రీ 12:5,6).

"ప్రేమ దోషములన్నిటిని కప్పును" (సామెతలు 10:12 - 1పేతురు 4:8).

"కీడుకు ప్రతికీడు చేసెదననుకొనవద్దు" (సామెతలు 20:22 - రోమా 12:17).

"నీ పగవాడు ఆకలిగొనినయెడల వానికి భోజనము పెట్టుము. దప్పిగొనిన యెడల వానికి దాహమిమ్ము అట్లు చేయుట చేత వాని తలమీద నిప్పులుకుప్పగా పోయుదువు" (సామెతలు 25:21,22 - రోమా 12:20).

జ్ఞానాధారుడైన దేవుడు అట్టి శ్రేష్టమైన మంచి జీవితాన్ని జీవించుటకు తగిన జ్ఞానమును, తెలివిని, వివేకమును, గ్రహింపును ప్రియ చదువరులందరికీ దయ చేయును గాక! - ఆమేన్!

**- ట్రాన్స్ వరల్డ్ రేడియో ఇండియా సౌజన్యముతో...**

యెహోవా భక్తుల మరణము ఆయన దృష్టికి విలువ గలది - కీర్తనలు 116:15

# ప్రభువు సన్నిధికి చేరిన ప్రార్థనా యోధులు



బిషప్ డా॥ కాళేపల్లి ఎలీషా గారు

జననం : 1939 మహిమ ప్రవేశం : 21-4-2024

మాకు అత్యంత ఆత్మీయులు, సీనియర్ దైవజనులు,
అలుపెరుగని సువార్త యోధులు,
ధవళేశ్వరం గ్రామములో పట్టు విడువని ప్రార్థనా పరులు,
నశించుచున్న అనేక ఆత్మలను రక్షణలోనికి నడిపించి,
86 సంవత్సరముల జీవిత యాత్రలో
66 సంవత్సరములు దేవుని సేవ చేసిన గొప్ప దైవజనులు,
ధవళేశ్వరం హౌస్ ఆఫ్ ప్రేయర్ వ్యవస్థాపకులు
**బిషప్ డా॥ కె.ఎలీషా గారు**
2024 ఏప్రియల్ 21వ తేది ఆదివారం
ప్రభువు నందు నిద్రించారు.
వారి జ్ఞాపకాలు మరువలేనివి... వారి కుటుంబమునకు
సంఘములకు దేవుని కృప, ఆదరణ కలగాలని ప్రార్థిస్తూ...

## శ్రీ గాలి సుబ్బరాజు & ఫ్యామిలీ

ఫౌండర్ & ఛైర్మన్ : గాలి సుబ్బరాజు ఫౌండేషన్, ధవళేశ్వరం

---



అందరికీ ఆహ్వానము

మీ దుఃఖదినములు సమాప్తములగును. - యెషయా 60 : 20

Bethesda CHARITABLE TRUST

యన్.వి. రావులన్న శక్తివంతమైన ప్రార్థనలకు పరలోకమునుండి
పరిశుద్ధాత్మ శక్తి ప్రజలపై కుమ్మరింపబడినప్పుడు వారి పాప,
శాప, రోగ, దురాత్మ బంధకములనుండి విడుదల పొందుచున్నారు.
వారి వాక్యసందేశము ద్వారా వేలాదిమంది ఆత్మీయంగా బలపడుచున్నారు.

రాజమహేంద్రవరం - కాతేరు బేతెస్థలో...

# యేసయ్య అద్భుతాలు




ఇక ఆలస్యమెందుకు రేపు మంగళవారమే
మీరు మీ కుటుంసమేతంగా విచ్చేసి
రావులన్న ప్రార్థన ఆశీర్వాదములు పొందండి.



దైవజనులు యన్.వి. రావులన్న

తిరుమలకాలేజ్ ఎదురుగా ప్రతి మంగళవారం ఉ॥ 9 గం॥ నుండి 12 గం॥ల వరకు




... కన్నుల ప్రతి భాష్ప బింధువును తుడిచివేయును మరణము ఒక ఉండదు దుఃఖమైనను, ఏడ్పయినను, వేదనైనను ఒక ఉండదు... - ప్రకటన 21 : 4 వివరములకు : 9393 515757

Edited, Printed & Published by G. Nageswara Rao, On behalf of Mahima Sabdham Imprints, 73-4-1, Narayanapuram, Rajahmundry. Cell : 93902 09376